# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :16 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 11-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## యాదగిరిగుట్ట నారసింహుని సేవలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాలలో నిర్వహిస్తున్న మహాపూర్ణాహుతికి హాజరయ్యారు. అదేవిధంగా చక్రతీర్థ స్నానంలో పాల్గొన్నారు. అంతకుముందు కొండపైన వీవీఐపీ అతిథి గృహ వద్దకు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి బ్యాటరీ వాహనంపై స్వామివారి మాడ వీధుల గుండా స్వయంభు పంచనరసింహస్వామి వారి దర్శించుకునేందుకు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన యాగశాలలకు వెళ్లి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో ఏం నడుస్తలేదు



హైదరాబాద్,మార్చి10: రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో పనిపోయిందని.. అక్కడ ఎవరూ రేవంత్‌రెడ్డిని ఖాతరు చేయడం లేదని.. ఆయన గురించి తెలిసినందువల్లే రాహుల్‌గాంధీ కోవర్టుల టాపిక్ తీసుకొచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్‌ను గతంలోనే టీఆర్ఎస్ ప్రతిపాదించిందని.. 2023లో అప్పుడు బీజేపీ ఆపిందన్నారు. ఆయన గతంలో టీఆర్ఎస్‌ను వీడకపోతే ఎప్పుడో ఎమ్మెల్సీ అయ్యేవారని అన్నారు. పట్టుబట్టి బీజేపీ ఆపిందని... ఇప్పుడు వారు ఆపినప్పటికీ దాసోజుకు బీఆర్ఎస్ అవకాశం ఇచ్చిందని మాజీ మంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిది ఢిల్లీలో ఏమీ నడుస్తలేదన్నారు. సాక్షాత్తు రాహుల్ గాంధీ గుజరాత్‌లో రేవంత్‌ను ఉద్దేశించి తమ పార్టీలో బీజేపీకి కోవర్టులు ఉన్నారని అన్నారన్నారు. రేవంత్ జుట్టు ఢిల్లీలో ఉందని.. ఆయన స్థానంలో ఎవరు ఉన్నా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. స్ట్రాంగ్ లీడర్లను బీజేపీ, కాంగ్రెస్ ఎదగనివ్వదని విమర్శించారు. ఇప్పటికీ మంత్రివర్గ విస్తరణ లేదన్నారు. రేవంత్ రెడ్డికి అంత ఉంటే ముందు కేబినెట్ విస్తరణ చేసేవారన్నారు. 39 సార్లు ఢిల్లీకి ఫ్లైట్ ఎక్కడం దిగడం తప్ప చేసింది ఏం లేదని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని కామెంట్స్ చేశారు. వారి సహకారంతో డబ్బులు భారీగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్ పేరిట రేవంత్ రెడ్డి భారీ కుంభ కోణానికి తెర లేపబోతున్నారని.. వెంటనే దీనిమీద శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 1947 నుంచి దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ సీఎం ఇంత స్థాయిలో డబ్బులు సంపాదించడం తెలియదేమో అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ పెరిగి ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఇండియా టుడే సదస్సులో రేవంత్ రెడ్డి దివాళాకోరుతనం బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని అన్నారు. గవర్నర్ అడ్రెస్ కార్యక్రమంలో కూడా అటెండ్ అవుతారని తెలిపారు. రేవంత్ స్థాయికి తాము చాలన్నారు. 'ఒక లీడర్‌గా , మాజీ మంత్రిగా, కేసీఆర్ బిడ్డగా, ఆయన అభిమానిగా.. నా వ్యక్తిగత అభిప్రాయం మేరకు ఈ చిల్లర గాళ్ళ ముందుకు రావాల్సిన అవసరం లేదు. కేసీఆర్ వస్తారా లేదా అన్నది ఆయన వ్యక్తిగతం' అని చెప్పుకొచ్చారు. త్వరలో తెలంగాణాలో పది ఉప ఎన్నికలు రాబోతున్నాయని సంచలన ప్రకటన చేశారు. తమకు ఈ మేరకు సమాచారం ఉందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్ని కలకు దూరంగా ఉన్నామన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో ఆర్ఆర్‌టాక్స్ నడుస్తోందన్న మోడీ ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిమీద మోడీకి ఎందుకు అంత ప్రేమ అని నిలదీశారు. కిషన్ రెడ్డి నిస్సహాయుడన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై తమ పార్టీ పునరాలోచనలో పడిందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు.. హాజరైన సీఎం

హైదరాబాద్,తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ నేడు పూర్తి కానుంది. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాల కోసం నామినేషన్లు దాఖలు చేయగా..ఇందులో కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులు, బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ నుండి అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి, సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యం అభ్యర్థులు నయోమిఇన్టిన్ దాఖలు చేసారు.ఇక ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ నేతలు హాజరయ్యారు. అలాగే ఈ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు పలికింది ఎంఐఎం పార్టీ. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు మద్దతుగా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి మాత్రమే పోటీలో ఉండటంతో ఈ ఎన్నికలు



ఏకగ్రీవంగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయ కేతనం ఎగరేసిన సంగతి తెలిసిందే.

## ఓటర్ల జాబితాపై అన్ని అనుమానాలే..




న్యూఢిల్లీ,దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలతో పాటు దేశ ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు.సోమవారం రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సమస్యను సభలో లేవనెత్తారు. ఈ అంశంపై సభలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై ప్రతిపక్షం చర్చ నిర్వహించాలని కోరుకుంటుందని తెలిపారు. మహారాష్ట్రతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ఓటర్ల జాబితాపై చర్చ జరగాలన్నారు. మొత్తం ఓటర్ల జాబితాపై చర్చ చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.గతేడాది హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలపై కూడా తీవ్ర ఆరోపణలు చేసింది. ఇటీవల పదవీ విరమణ చేసిన మాజీ కేంద్ర ఎన్నికల కమిషన్ రాజీవ్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. తాజాగా ఇదే అంశంపై లోక్‌సభలో చర్చ చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.సోమవారం (మార్చి10) నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. తొలి విడత బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభమై.. ఫిబ్రవరి 13న ముగిశాయి. ఇక ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక సోమవారం నుంచి రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి.

## నేను ఎవరి సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదు

హైదరాబాద్,మార్చి10:తాను సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో ఫైట్ చేస్తానని.. త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆఫ్ ది రికార్డ్‌లో ఆయన వెల్లడించారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి అతనే జగ్గారెడ్డి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉంది అని చెప్పారన్నారు. 'ఆ కథలో మీ పాత్ర ఉందని అన్నారు. ఆ సినిమాలో నటిస్తా అని చెప్పాను. ఈ కథలో నా ఒరిజినల్ క్యారక్టర్ కూడా ఉండబోతుంది. ఈ ఉగాదికి సినిమా కథ విని.. వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తాం. పీసీసీ, సీఎం అనుమతి తీసుకొని నటిస్తాను' అని వెల్లడించారు. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేశారు జగ్గారెడ్డి. అదే 'జగ్గారెడ్డి...వార్ ఆఫ్ లవ్' అనే టైటిల్‌ను ఖారారు చేసినట్లు తెలిపారు. ఇక రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక చూసి మైండ్ బ్లాక్ అయిందన్నారు. తాను రాజకీయంగా షాక్‌లో ఉన్నట్లు తెలిపారు. తన షాక్‌కు కాలం సమాధానం చెబుతుందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు జట్టి కుసుము అని తెలిపారు. అనుకోకుండా ఢిల్లీకి తెలంగాణ నుంచి నేతలు రాలేదన్నారు. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభను తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి కష్టాలు



పరిణామాలు చెప్పాలని అనుకున్నానని.. దానిపై రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని సమయం అడిగానని అన్నారు. కుసుమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, డిప్యూటీసీఎ భట్టి విక్రమార్కకు చెప్పానన్నారు. తాను ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశాన్ని ముందే చెప్పినట్లు తెలిపారు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,కేసీ వేణుగోపాల్ లేరని జగ్గారెడ్డి వెల్లడించారు.

## ప్రణయ్ కేసులో ఒకరికి ఉరి.. ఆరుగురికి జీవితఖైదు

నల్లగొండ,తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైన మిర్యాలగూడ పరువు హత్య కేసులో సంచలన తీర్పు వెలువడింది. ప్రణయ్(24)ను దారుణంగా చంపిన సుభాష్ శర్మకు నల్లగొండ ఎస్సీ/ ఎస్టీ కోర్టు మరణశిక్ష శిక్ష విధించింది. అలాగే మిగతా ఆరుగురు నిందితులందరికీ జీవిత ఖైదును ఖరారు చేసింది. అమృత వర్షిణి-ప్రణయ్‌లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆ స్నేహం.. ప్రేమగా మారి 2018లో పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. ప్రణయ్ కుటుంబ సభ్యులు ఆ ప్రేమ వివాహాన్ని అంగీకరించగా.. తన కుమార్తె కులాంతర వివాహం చేసుకుందని మారుతీ రావురగిలిపోయాడు. ఈ క్రమంలో ఆమె భర్త ప్రణయ్‌ను హతమార్చడానికి అస్ఘర్ అలీకి కోటి రూపాయల సుపారీ ఇచ్చాడు. అస్ఘర్ ఏడుగురితో కలిసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి ప్రణయ్‌ను అంతమొందించాడు. ఆరేళ్లకు పైగా ప్రణయ్ కేసు విచారణ జరిగింది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు మారుతి రావు ఆత్మహత్య చేసుకోగా.. మరో ముగ్గురు నిందితులు జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా నలుగురు నిందితులు బెయిల్ మీద బయట ఉన్నారు. ఈ నేపథ్యంలో నిందితులదరినీ ఇవాళ కోర్టులో పోలీసులు హాజరు పరిచి.. తీర్పు అనంతరం అదుపులోకి తీసుకున్నారు. 2018లో ప్రణయ్-అమృతల వివాహం జరిగింది. ఐదు నెలల గర్భంతో ఉన్న భార్య అమృతతో కలిసి చెకప్‌నకు వెళ్లి తిరిగి వస్తుండగా.. సుపారీ గ్యాంగ్‌లోని సుభాష్ శర్మ గొడ్డలితో ప్రణయ్‌పై దాడి చేయడంతో తల్లి, భార్య చూస్తుండగానే రక్తపు మడుగులో విలవిలలాడుతూ మరణించాడు. మిర్యాలగూడలో 2018 సెప్టెంబరు 14వ తేదీన పెరుమాళ్ల ప్రణయ్ అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి.. ప్రణయ్ తండ్రి బాలస్వామి ఫిర్యాదుతో మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు అయ్యింది.

-ఈ కేసులో అమృత తండ్రి మారుతీ రావు ఏ1గా ఉండగా.. ప్రణయ్‌ను కత్తితో నరికి చంపిన సుభాష్ శర్మ ఏ2గా ఉన్నాడు. మొత్తంగా ఎనిమిది మందిపై కేసు నమోదు కాగా.. దాదాపు ఐదున్నరేళ్ల పాటు సాగిన విచారణ సాగింది.

-ఏ-3 అజ్గర్ అలీ, ఏ-4 అబ్దుల్ భారీ, ఏ-5 ఎంఏ కరీం, ఏ-6 తిరునగరు




శ్రవణ్ కుమార్(మారుతి రావు సోదరుడు), ఏ-7 సముద్రాల శివ(మారుతి రావు డ్రైవర్), ఏ-8 నిజాం(నిందితులు ప్రయాణించిన ఆటో డ్రైవర్ ఓనర్)గా ఉన్నారు.

-2019 జూన్ 12న పోలీసుల చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అరెస్టైన అమృత తండ్రి మారుతి రావుకు బెయిల్ దక్కింది.ఏ-1 మారుతీరావు 2020 మార్చి7వ తేదీన హైదరాబాద్ ఖైరతాబాద్ వైశ్య భవన్ లో ఆత్మహత్య చేసుకున్నారు. ఇక నల్లగొండ జిల్లా కోర్టు సముదాయంలోని.. ఎస్సీ ఎస్టీ కోర్టు ఈ కేసును సుదీర్ఘంగా విచారించి.. మార్చి 10కి(ఇవాళ్టికి) తీర్పును రిజర్వ్ చేసింది.

-మరో ఏడుగురు నిందితుల పాత్రపై సైంటిఫిక్ ఎవిడెన్స్, పోస్టుమార్టం నివేదిక, చార్జ్ షీట్ తో పాటు సాక్షులను విచారించింది కోర్టు

-నిందితుల్లో అస్ఘర్ అలీ ఐఎస్ఐ ఉగ్రవాదిగా తేలింది. గతంలో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్యతో పాటు పలు ఉగ్ర కుట్రల్లో కీలకంగా వ్యవహరించాడు. అంతేకాదు.. ప్రణయ్ కేసులో మారుతి రావు సుపారీ ఇచ్చింది కూడా ఇతనికే. మొత్తం ఏడుగురిని ఒక గ్రూప్‌గా చేసి.. ప్రణయ్ హత్య స్కెచ్‌ను అస్ఘర్ అమలు పరిచాడు.

## పదవులు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దు..



విజయవాడ:ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల వేళ.. ఆ కోటాలో పదవి పొందేందుకు చాలా మంది నేతలు ప్రయత్నాలు సాగించారు.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ని కలిసి..విన్నవించుకున్నారు.. అయితే, ఉన్నది ఐదు సీట్లు మాత్రమే.. అందులో జనసేన, బీజేపీకి చెరో సీటు కేటాయించిన తర్వాత.. మిగిలిన మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది టీడీపీ.. దీంతో, కొన్ని ప్రాంతాల్లో ఆందోళన జరిగినట్టు తెలుస్తోంది.. టికెట్ ఆశించి భంగపడిన నేతలు కొందరు అసహనం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు మాత్రం.. పార్టీ అధినేతపై నమ్మకాన్ని ప్రకటిస్తారు.. ఈ తరుణంలో.. మీడియా చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి నారా లోకేష్.. ఎమ్మెల్సీలుగా బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాం.. బలహీనవర్గాలపై టీడీపీకి ఉన్న చిత్తశుద్ధిని మరోసారి చాటాం అన్నారు లోకేష్..ఇక, యువ మహిళలను ప్రోత్సహించాలని గ్రీష్మకు అవకాశం ఇచ్చామని వెల్లడించారు మంత్రి నారా లోకేష్.. మరోవైపు, పార్టీ కోసం కష్టపడిన వారందరికీ పదవులు వస్తాయి అని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు.. పదవులు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దు అని సూచించారు. ఇక, టీచర్ల సమస్యలను క్రమపద్ధతిలో పరిష్కరించాం. అంగన్వాడీలకు సంబంధించిన 4 సమస్యల పరిష్కరించామని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు మంత్రి నారా లోకేష్.. కాగా, అసెంబ్లీ కమిటీ హాల్ లో నామినేషన్లు దాఖలు చేశారు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కావలి గ్రీష్మ, బీటీ నాయుడు, బీదా రవిచంద్ర.. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెంనాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.


## లక్షన్నర కోట్లు అప్పు చేశారు..ఆ డబ్బుకు లెక్కలు చెప్పండి



హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. 15 నెలల్లో రూ ఒక లక్ష 50 వేల కోట్ల అప్పు అంటూ ఆరోపించారు. తెలంగాణ భవన్ లో ఆమె నేడు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రం రూ. 1.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, వివాహం చేసుకునే మహిళలకు 10 గ్రాముల బంగారం, యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, రూ. 4,000 పెన్షన్ వంటి కీలక వాగ్దానాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం భారత రాష్ట్ర సమితి పార్టీ పేగులు తెగేలా పోరాడిందని, అప్పటి కష్టం మరువలేనిదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కొన్ని సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఆ పోరాటంలో కొంతమందికి మాత్రం ఎలాంటి పాత్రా లేదని ఆమె పేర్కొన్నారు. జరుగుతోందని, రాష్ట్రానికి వచ్చే ఆదాయం ప్రతినెల రూ. 18,800 కోట్లు ఉంటుందని ఆమె తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెల రూ. 3,000 కోట్లు ఖర్చు చేస్తున్నదని అన్నారు. గడిచిన 15 నెలల్లో 1,52,918 కోట్ల అప్పు తీసుకొచ్చారని, ఆ డబ్బులు ఎటు పోయాయో ప్రజలకు వివరించాలని కవిత డిమాండ్ చేశారు.

## పథకాలు అమలు,కార్యక్రమాల నిర్వహణపై సీఎం కీలక సమీక్ష

అమరావతి, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు, కార్యక్రమాల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.. శాఖల వారీగా పురోగతిపై చర్చ జరిగింది ఆర్టీజీఎస్ ప్రభుత్వ పథకాల అమలుపై సర్వే నిర్వహించింది..దీనిపై చంద్రబాబు సమీక్ష చేశారు.. వివిధ పథకాల అమల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అధికారులతో చర్చించారు.. ప్రతి వారం నాలుగు శాఖలపై సమీక్ష చేస్తున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచడం, ప్రజల సంతృప్తి చెందేలా కార్యక్రమాలు అమలు చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.. ఈ వారం రెవెన్యూ సర్వీసులు, ఆసుపత్రుల్లో సేవలు, దేవాలయాలు, మున్సిపల్ శాఖల్లో సేవలపై వచ్చిన రిపోర్టులపై సమీక్ష చేశారు ఏపీ సీఎం..ఈ సందర్భంగా సీఎం చంద్రబాబ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. పదే




పదే ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలన్నారు. కింది స్థాయి ఉద్యోగులు, అధికారులకు ఉన్నతాధికా రులు

# సంపాదకీయం

మంగళవారం 11-03-2025

## ఈ అనిశ్చితి పోయేదెలా?

జనవరి 20న గద్దెనెక్కినప్పటినుంచీ అధిక టారిఫ్‌లపై హెచ్చరిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... చివరికి అందుకు తుది గడువు ఖరారు చేశారు. తమ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాలన్నీ వచ్చే నెల 2 నుంచి తమ దెబ్బ కాచుకోవాలని హెచ్చరిక జారీచేశారు. దాదాపు వంద నిమిషాలపాటు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి బుధవారం ఆయన చేసిన ప్రసంగం నిండా ఇలాంటి హెచ్చరికలున్నాయి. ఇప్పటికే చాలా సాధించినట్టు స్వోత్కర్షలున్నాయి. అమెరికా ప్రజల పాలిట తాను ఆపద్బాంధవుడినన్న భ్రమ కూడా ఆయనకు పుష్కలంగా ఉంది. 'నేను విధించబోయే సుంకాలు కేవలం ప్రజానీకం ఉద్యోగాలు కాపాడటానికి మాత్రమే కాదు... ఈ చర్య మన దేశ ఆత్మను కాపాడటానికి కూడా' అని ఆయన చెప్పుకొచ్చారు. సహజంగానే ప్రపంచమంతా ఏప్రిల్ గురించి బెంగపడుతోంది. ముంచుకొచ్చే ద్రవ్యపరమైన అసమతౌల్యతను అధిగమించడమెలాగో తెలియక అయోమయంలో కూరుకుపోతోంది. ఇప్పటికే ట్రంప్ చైనాపై అదనంగా 10 శాతం, మెక్సికో, కెనడాలపై మరో 25 శాతం సుంకాలు ప్రకటించటం వల్ల ఈ ఉపద్రవం ఖాయమని అన్ని దేశాలూ ఆందోళనతో ఉన్నాయి. సుంకాలను ట్రంప్ 'సర్వరోగ నివారిణి'గా భావిస్తున్నారు. మెక్సికో మాదకద్రవ్య ముఠాల నుంచి పెద్ద యెత్తున వచ్చిపడే ఫెంటానిల్ అమెరికాకు పెద్ద సమస్యగా మారింది. అక్రమ వలసలు దీనికి అదనం. వలసలను అరికట్టి, మాదకద్రవ్య ముఠా నాయకుల్ని పట్టి అప్పగించకపోతే 25 శాతం సుంకాలు తప్పవని గత నెల 4న ట్రంప్ హెచ్చరించటంతో కెనడా, మెక్సికోలు ఒక నెల వ్యవధి కోరాయి. మెక్సికో అధ్యక్షురాలు షీన్‌బామ్ వెనువెంటనే అమెరికా%-%మెక్సికో సరిహద్దుల్లోకి అదనంగా 10,000 మంది సైనికులను తరలించి తనిఖీలు పెంచి వలసలను నియంత్రించారు. దేశంలో ఫెంటానిల్ నిల్వలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయటంతోపాటు భారీయెత్తున అరెస్టులు చేయించారు. 29 మంది డ్రగ్స్ ముఠా నాయకుల్ని అమెరికాకు అప్పగించారు. కెనడా అధ్యక్షుడు ట్రూడో ఫెంటానిల్ సరిహద్దులు దాటకుండా తనిఖీ వ్యవస్థను ముమ్మరం చేశారు. అయినా ట్రంప్ మనసు మారలేదు. ఆ రెండు దేశాలపై 25 శాతం అదనపు సుంకాలుంటాయని తన ప్రసంగంలో ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్ని కల్లో పార్టీ ఓటమి ఖాయమన్న అంచనాలుండటంతో దీన్ని తనకు అనుకూలంగా మలుచుకోవ టానికి ట్రూడో సిద్ధపడ్డారు. అందుకే 'సై అంటే సై' అంటున్నారు. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించ బోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే 2,100 కోట్ల డాలర్ల విలువైన సరుకుపై సుంకాలు వడ్డించారు. వివాదం సద్దుమణగకపోతే మరో 8,700 కోట్ల డాలర్ల సరుకుపై ఇది తప్పదని హెచ్చరించారు. షీన్‌బామ్ ఈమధ్యే అధికారంలోకొచ్చారు గనుక ఆమెకు కావలసినంత వ్యవధి వుంది. అందుకే ఎంతో సంయమనం పాటిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని తలకిందులు చేసే ఈ మాదిరి బ్లాక్‌మెయిలింగ్ కొత్తగా ట్రంప్‌కు పుట్టిన బుద్ధికాదు. అమెరికాలో ఎవరున్నా ఇలాంటి బెదిరింపులతోనే ప్రపంచ దేశాలను దారికి తెచ్చుకున్నారు. 1986%-%89 మధ్య సుంకాలు, వాణిజ్యాలపై సాధారణ ఒడంబడిక (గాట్)కు సంబంధించిన ఉరుగ్వే రౌండ్ చర్చల్లోనైనా, ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)పై జరిగిన దోహా రౌండ్ చర్చల్లోనైనా అమెరికా వ్యూహం ఇదే. బ్రెజిల్ నుంచి వచ్చిన 4 కోట్ల డాలర్ల దిగుమతులపై వంద శాతం సుంకాలు విధించింది. మన నుంచి వెళ్లిన వస్త్ర దిగుమతులపైనా ఇలాంటి చర్యే తీసుకోబోతున్నట్టు హెచ్చరించింది. దాంతో మేధా సంపత్తి హక్కుల(ఐపీఆర్)పై అమెరికా తీసుకొచ్చిన అన్యాయమైన నిబంధనలకు తలొగ్గక తప్పలేదు. ఆఫ్రికా దేశాలనూ ఇలాగే దారికి తెచ్చుకుంది. అమెరికా అతి పెద్ద మార్కెట్ కావటం వల్ల అత్యధిక దేశాలు దానికెళ్లే ఎగుమతులపై ఆధారపడి వుంటాయి. మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులు 18 శాతమైతే థాయ్‌లాండ్ నుంచి 17 శాతం, దక్షిణ కొరియానుంచి 16 శాతం ఎగుమతులుంటాయి. అమెరికాకు మెక్సికో ఎగుమతులు ఏకంగా 78 శాతం. తమ సంపద పెంచుకోవటానికి సంపన్న రాజ్యాలు నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. భారత్‌తో సహా అనేక దేశాలు సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిపోవటానికి ఏకైక కారణం ఇదే. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లభ్యతకూ, తయారైన సరుకు అమ్ముకోవటానికీ సరిహద్దులు దాటి వెళ్తూ సమయానుకూలంగా విధానాలు మార్చుకోవడం సంపన్న రాజ్యాల నైజం. గతంలో తన మార్కెట్‌ను విస్తరించుకోవటానికి డబ్ల్యూటీవో తీసుకొచ్చిన అమెరికాయే ఇప్పుడు వేరే మార్గానికి మళ్లింది. అయితే ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం అధికమవుతుంది. సగటు పౌరుల జీవన వ్యయం పెరిగి పోతుంది. వ్యాపారం దెబ్బతిని నిరుద్యోగం ప్రబలుతుంది. ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. తరతమ స్థాయిల్లో అన్ని దేశాలూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. 80 ఏళ్లుగా ప్రపంచ మార్కెట్లను శాసిస్తూ అతిగా సంపద పోగేసిన దేశమే 'నన్ను అందరూ దోచుకుతింటున్నార'ంటూ పెడబొబ్బలు పెట్టడం ఒక వైచిత్రి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తోంది. ఇప్పుడు ఒక్కొక్క దేశం అమెరికాపై ప్రతీకార సుంకాలకు రెడీ అవుతోంది. ముమ్ముందు కొత్త మార్కెట్ల వెదుకులాట కూడా మొదలవుతుంది. ఇలాకాక దేశాలన్నీ సమష్టిగా వ్యవహరిస్తేనే ఏదో మేర ప్రయోజనం ఉంటుంది. అమెరికాపై ఒత్తిడి పెరిగి సహేతుకమైన పరిష్కారం వీలవుతుంది.

# పార్లమెంటులో రచ్చ కానున్న డీ లిమిటేషన్ !



న్యూఢిల్లీ,పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో సెషన్ సోమవారం నుంచి జరుగనున్నది. ఈ సమావేశంలోనే పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. ఇప్పటికే పలు అంశాలపై విపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వాటిని పార్లమెంట్ వేదికగా చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ప్రధానంగా జనగణన, అందులోనే కులగణన చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జనగణన చేపట్టేందుకు ఇప్పటికే అధికార బిజెపి సానుకూల సంకేతాలు ఇచ్చింది. అయితే కులగణకు మాత్రం ససేమిరా అంటోంది. దేశంలో కులచిచ్చు రగల్చడం సరికాదని బిజెపి వాదిస్తోంది. నిజానికి ఇప్పుడున్న కాలంలో ఇంకా కులాల కుంపట్లు పట్టుకుని వేలాడుతా మంటే కుదరదు. తెలంగాణ, బీహార్‌లో కులగణన చేసినా పెద్దగా ఒరిగిందేమీ లేదు. కులాల ఓట్లను పొందేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా తప్ప మరోటి కాదు. మరో ముఖ్య విషయం నియోజకవర్గాల పునర్విభజన అంశం. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. .నాభా ఆధారంగా నియోజకవర్గాల గణన చేస్తే తాము నష్టపోతామని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. సీట్లు తగ్గవని అంటున్న బిజెపి..ఏ సీట్లు తగ్గవో స్పష్టంగా చెప్పడం లేదు. ఇప్పటికే తమిళనాడు సిఎం స్టాలిన్ దీనిపై యుద్ధం మొదలు పెట్టారు. దక్షిణాది రాష్ట్రాల సిఎంలకు లేఖలు రాసారు. తగ్గిన జనాభా కారణంగా నియోజకవర్గాల కుదింపు కుట్రలు జరుగు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా దానికి కొనసాగింపుగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా పల్లవి అందుకున్నారు. సీట్ల తగ్గింపు జరగదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటున్నారు. అయితే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలో కూడా సీట్లు పెరుగుతాయా లేదా అన్నది బిజెపి స్పష్టం చేయడం లేదు. ఈ క్రమంలో సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఇది విపక్షాలకు ప్రధాన ఎజెండా కానుంది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటివి రానున్న ఒకటి రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని బిజెపి పట్టుదలగా ఉంది. ఆ తరవాత జమిలి ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళిక సిద్దం చేస్తున్నట్లు రాజకయీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ సమావేశాల్లోనే జమిలి ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంటారా లేదా అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికే జమిలి ఫీవర్ పట్టుకుంది. జమిలి ఎన్నికలు జరిపి తీరుతామన్న పట్టుదలలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం అని విపక్షాలు ఇప్పటికే వాదిస్తున్నాయి. ఎందుకంటే వారికి నిరంతర ఎన్నికల ప్రక్రియ ఉంటేనే జీవితం గగడవదు. అయితే జమిలి ఎన్నికలతో వచ్చే నష్టం లేదు. తరచూ ఎన్నికల వల్ల దేశ ఖజానాకు బొక్క పడుతోంది. అలాగే రాజకీయ నాయకులు నిత్యం ఎన్నికలతో ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు ఎన్నికల గాలికి కొట్టుకు పోతున్నాయి. దేశాన్ని గాడిలో పెట్టాలంటే పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ మోడీ ప్రభుత్వం చేయగలుగుతుందా..అంతటి చిత్తశుద్ధి ఉందా అన్నది చూడాలి. ప్రధానంగా జమిలికి ముందే దేశ జనాభా గణన జరగాలి. దీంతోపాటే ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకుని రావాలి. ఎవరెన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా, రాజకీయ పోరాటం చేసినా..దేశానికంతటికీ ఒకేదేశం, ఒకే చట్టం అమల్లోకి రావాలి. అలాగే ప్రధానంగా పెరుగుతున్న జనాభాను కట్టడి చేయాలి. ఇందులో కులమతాలకు తావులేకుండా చేయాలి. ఇవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజక వర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్లసంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ,లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. సీట్లు పెరిగితే తమకు ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే రాజకీయ పదవులను తగ్గించే పని కూడా చేపడితే మంచిది. రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థతో పాటు శాసనమండలులు కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఉన్నాయి. వీటిని శాశ్వతంగా ఎత్తేస్తే మంచిది. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితం కాకుండా లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచాలని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎందుకంటే ఎన్ని సీట్లు పెంచితే అన్ని విధాలుగా లబ్ది పొందేది కేవలం రాకజీయ పార్టీలు మాత్రమే. దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఇకపోతే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించారు. దీనికి జనాభగణను లింక్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకంగా ఉంది. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేందుకు ఉన్న ఆటంకాలు తొలగిపోతాయి.

# ఇరిగేషన్ హస్తవ్యస్తం.. పడకేసిన ప్రాజెక్టుల మరమ్మతులు!



హైదరాబాద్,: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువల పరిధిలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే పడకేశాయి. సీజన్ గడచిపోతున్నా ఇప్పటికీ చాలాచోట్ల పనులు చేపట్టలేదు. పనులపై ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేకుండా పోయినట్టు తెలుస్తున్నది. మరోవైపు నీటిపారుదల శాఖను భారీగా పోస్టుల ఖాళీలు పట్టి పీడిస్తున్నాయి. ఫలితంగా నీటి నిర్వహణ గాడి తప్పి సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కాలువలు, చెరువుల తూములు, పంప్‌హౌస్‌లు, ప్రాజెక్టుల గేట్లు తదితర మరమ్మతుల పరిశీలనకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఏఈ నుంచి సీఈల వరకు ఆర్థిక అధికారాలను బదలాయించింది.అందులో భాగంగా మూడేండ్లుగా ప్రాజెక్టుల పర్యవేక్షణ బాధ్యతలను ఓఅండ్ విభాగమే చూస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన 1,294 పనుల్లో ఇప్పటికీ 478 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి చేసిన పనుల్లో దాదాపు 73 శాతం మొదలే కాలేదు. ప్రధానంగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే మరమ్మతులు మందకొడిగా కొనసాగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు వివరిస్తున్నారు. ఓఅండ్ఎం పనుల నిర్వహణకు వేసవి కాలమే అనువైనది. వర్షాకాలంలో వానలు, వరదలు, బురద వల్ల ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవు. నివాస ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉండి, నీటిని విడుదల చేయడంతో పనులు చేపట్టడం కష్టంగా ఉంటుంది. వేసవిలో నీటి నిల్వలు తగ్గిపోయి, కాలువలకు నీటి విడుదల బంద్ చేయడం వల్ల వేగంగా, సజావుగా మరమ్మతులు నిర్వహించబడతాయి. దీనికి 3 నెలలు మాత్రమే సమయం ఉంటుంది.

మందకొడిగా పనులు

ప్రస్తుతం ఓఎండ్ఎం పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. 2023-24లో 1,294 పనుల్లో 816 పనులు పూర్తి కావడం లేదు. మరో 478 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2024-25లో 926 పనులకు ఆమోదం తెలిపితే, కేవలం 247 (27 శాతం) పనులు పూర్తికాగా, 73 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. 272 పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. ఒప్పంద దశలో మరో 126 పనులు ఉన్నాయి. ఇదే పరిస్థితి ఉంటే జూన్ నాటికి పూర్తిచేయడం కష్టమేనని తెలుస్తున్నది.

చికిత్సలపై ప్రభుత్వం శీతకన్ను

ఓఅండ్ఎం పనులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అత్యవసర పనులపైనా ప్రభుత్వానికి పట్టింపులేకుండా పోయింది. ఈ ఏడాది భారీ వరదలకు వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో ఇతర జిల్లాలో పదుల సంఖ్యలో చెరువులు తెగిపోయాయి. వాటికి తాత్కాలిక చర్యలు చేపట్టారు. శాశ్వత మరమ్మతులకు అనుమతులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రారంభించలేదు. వివిధ ప్రాజెక్టుల్లో సత్వరమే చేపట్టాల్సిన పనులపైనా ప్రభుత్వం దృష్టిసారించిన దాఖలాలు లేవు.

నీటిపారుదల శాఖలో

భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికీ రెగ్యులర్ అధికారులను, సిబ్బందిని నియమించకుండా ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించడంతో నీటి విడుదల పర్యవేక్షణకు క్షేత్రస్థాయిలో ఉంది అధికారులు లేని దుస్థితి నెలకొంది. అదనపు బాధ్యతల కోసం పంటలకు నీటి విడుదలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించలేని పరిస్థితి నెలకొంది. దీంతో కమాండ్ ఏరియా పరిధిలోని ఆయకట్టుకు సైతం పూర్తి స్థాయిలో సాగునీరందని దుస్థితి నెలకొంది. దీనితో వ్యవ సాయ బోర్లన్నీ వెలవెలబోతూ పొట్ట దశలో పంటలు ఎండుతున్నాయి.

ప్రణాళికలేమి తొలి వైఫల్యం..

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం, నిజాంసాగర్, సింగూరు, నాగార్జునసాగర్, శ్రీశైలం తదితర మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవసరాలు పోగా, యాంగికి 354.88 టీసీలు ఉంటాయని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఐఏఎం) గత డిసెంబర్‌లో లెక్కతేల్చింది. మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయించింది. మేజర్ ప్రాజెక్టుల్లో 277.59 టీసీలు ఉండగా వాటి కింద 30.96 లక్షల ఎకరాలకు, మీడియం ప్రాజెక్టుల్లో 30.38 టీఎంసీలుండగా 2.68 లక్షల ఎకరాలకు, మైనర్ ప్రాజెక్టులు మొత్తం 37.40 టీఎంసీలతో 7.23 లక్షల ఎకరాలకు, ఐడీసీ లిఫ్టుల కింద 9.5 టీఎంసీలతో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరందించే అంచనాలు రూపొందించబడ్డాయి. వెట్‌క్రాప్స్‌కు 24.54 లక్షల ఎకరాలు, ఐడీ క్రాప్స్‌కు 17.94 లక్షల ఎకరాలకు నీరందించేందుకు తైబందీ ఖరారు చేసింది.జనవరి 1 నుంచి మార్చి 31 వరకు ఆన్ అండ్ ఆఫ్ సిస్టమ్‌లో మొత్తం 6 తడులకే నీరందించాలని నిర్ణయించింది. కమిటీ ప్రణాళికలన్నీ ఇప్పుడు తారుమారయ్యాయి. అధికారులు వరి, ఆరుతడి పంటలకు తైబందీ ఖరారు చేయగా, క్షేత్రస్థాయిలో రైతుల అంచనాలకు మించి వరి సాగుకే మొగ్గుచూపారు. ఆరుతడి పంటల సాగు నామమాత్రంగా చేపట్టారని ఫీల్డ్ ఇంజినీర్లు చెప్తున్నారు. ఇదే ముందుగానే ముందుగానే నివేదించామని, పూర్తి స్థాయిలో నీరివ్వలేమని, ప్రాజెక్టుల కింద ఆయకట్టును కుదించాలని తేల్చిచెప్పామని వివరిస్తున్నారు. చాలా చోట్ల ప్రాజెక్టుల ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువల్లో పూడిక పేరుకుపోయిందని చెప్తున్నారు. వివిధ కారణాలతో దిగువకు నిర్దేశించిన మొత్తం కంటే తక్కువ నీరు వెళ్తున్నదని వివరించారు. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని. అయినా వారి మాటలను పెడచెవిన పెట్టి ప్రణాళికలను రూపొందించారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షకులేరీ?

సాగునీటి విడుదల పర్యవేక్షణను ప్ర భుత్వం గాలికి వదిలేసింది. నీటిపారుదలశాఖ ఇన్‌చార్జిల పాలనలోనే సాగుతోంది. కీలక పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. పూర్తికాలపు అధికారులను నియమించకుండా ప్రభుత్వం ఇష్టారీతిన ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏడాదిన్నరగా నెట్టుకువస్తోంది. మొత్తం 22 చీఫ్ ఇంజినీర్ పోస్టులు ఉంగా, 15 మంది విరమణ పొందారు. ఏడాది క్రితమే ఈఎన్సీ జనరల్ పోస్ట్ ఖాళీగా, ఓఅండ్ఎం ఈఎన్సీ పోస్టు కూడా ఖాళీ అయింది. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈతోపాటు వివిధ జిల్లాల సీలంతా విరమణ పొందగా, ఈలు, ఎస్ఈలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈఈలు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రధాన కార్యాలయాలకే పరిమితమయ్యారని వివరించారు. పనిభారంతో నీటివిడుదల పర్యవేక్షణపై ఏమాత్రం దృష్టిసారించలేని దుస్థితి నెలకొంది.చివరి ఆయకట్టు కాదు

మొదటికే మోసం..

రాష్ట్రవ్యాప్తంగా వానకాలంలో అత్యధిక వర్షాలు కురిశాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. అయినా ప్రస్తుత యాసంగిలో చివరి ఆయకట్టుకు కాదుకదా మొదట ఉన్న ఆయకట్టుకే నీరందని విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రణాళికలు తారుమారు కావడం ఒకటైతే నిర్దేశిత షెడ్యూల్‌ను పాటించకపోవడం కూడా మరో కారణమని తెలుస్తున్నది.

# లింగ వివక్షకు దూరంగా మహిళ

న్యూఢిల్లీ, 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించటం ప్రారంభించింది. అంతేకాదు, ప్రతి ఏటా ఏదో ఒక ఇతివృత్తం అంటే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అంతర్జాతీయ మహిళా సమానత్వం 2025 థీమ్‌గా నిర్ణయించారు. అంటే లింగ వివక్ష లేకుండా ముందుకు సాగడం అన్నది ఈయేటి సంకల్పంగా ప్రకటించారు... స్త్రీలు సాధికారత పొందాలంటే వారి ఆకాంక్షలకు సమాజం ఆమోదం తెలపాల్సిందే. ఒక స్త్రీ అంటప్రెన్యూర్ కావాలనుకున్నా, పెద్ద పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానానికి ఎదగాలనుకున్నా, కాన్పు సమయంలో బ్రేక్ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత తిరిగి తన ఉద్యోగం చేయాలని అనుకున్నా, పెళ్లి తర్వాత పై చదువులకు వెళ్లాలను కున్నా, గృహిణిగా ఉంటూ ఇంటిపట్టునే ఏదైనా పనిచేసి సంపాదించాల నుకున్నా వారికి అడ్డుగా నిలవకపోవడమే చేయవలసింది. ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు తమ సంపాదనలో 90 శాతం కుటుంబం కోసం ఖర్చు పెడతారు. పురుషులు నలభై,యాభై శాతం ఖర్చు పెడతారు. స్త్రీలు సాధికారత పొందడం అంటే తాము ఏం చేసినా పడి ఉంటుందనే భావన నుంచి పురుషులను బయట పడేయడం అని అర్థం చేసుకోవాలి.అభివృద్ధి విధాన రూపకల్పనకు సంబంధించి నిర్ణయం తీసుకునే పక్రియలో మహిళలను ఆర్థికంగా భాగస్వాములుగా ఎలా చేయవచ్చో థీమ్ హైలైట్ చేస్తుంది. భవిష్యత్ వైపు అడుగులు వేయాలంటే మహిళలను ముందుకు తీసుకుని వెళ్లడంతో పాటు, లింగవివక్ష లేకుండా చేయాలి. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా ....అన్న ఆర్యోక్తిని మననం చేసుకోవడం నిరంతరంగా సాగాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజలందు కొంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడరో అక్కడ ఎంత గొప్ప సత్కార్యాలైననూ ఫలించవు అని మన సంస్కృతి తెలుపుతుంది. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజి స్తారో, అక్కడ సర్వసంపదలూ ఉండడమే కాక రథ, గజ, తురగ పదాదులతో కూడిన లక్ష్మీ దేవి అచంచలయై నిలబడుతుంది. విప్లవాత్మక మార్పుల కోసం అడుగు వేయాలని తెలిపింది. మహిళల పురోగతిని నిరోధించే సాంస్కృతిక, చారిత్రక, సామాజిక-ఆర్థిక అవరోధాల అడ్డును తొలగించాలనేది ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం.స్త్రీలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి. ముఖ్యంగా దిగువ, మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక అక్షరాస్యతను కలిగించాలి. వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ బడ్జెట్, పొదుపు, ఆదాయం తెచ్చే పెట్టుబడి... వీటి గురించి అవగాహన ఉండాలి. 'మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే' మీ దగ్గర ఎంత డబ్బు ఉండాలి... అందుకు ఏమి చేయాలో తెలుసుకోవాలి. సొంత ఆస్తి, స్వీయపేరు మీద పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, షేర్లు, ఎమర్జన్సీ ఫండ్ కలిగి ఉండటం, డిజిటల్ పరిజ్ఞానం పొంది ఉండటం? అంటే ఆర్థిక లావాదేవీలు ఫోన్‌మీద, కంప్యూటర్ మీద చేయగలిగి వేగంగా పనులు నిర్వర్తించ గలగడం. కుటుంబ సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అనుకుంటే కుటుంబంలో కీలకమైన వాటాదారైన స్త్రీ ఎంత ఆర్థిక సమృద్ధితో ఉంటే దేశ సమృద్ధి అంతగా పెరుగుతుంది. ఉమెన్స్ డే సందేశం అదే. స్త్రీలు సాధికారత ఎప్పుడు పొందుతారంటే ఆర్థికంగా వారు స్వేచ్ఛ పొందినప్పుడు. స్త్రీలకు సామాజికంగా, కుటుంబ పరంగా హక్కులు ఉంటాయి. అయితే ఆ హక్కులను దక్కించు కోవాలంటే వారికి ఆర్థిక ఆత్మవిశ్వాసం ఉండాలి.'ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టడానికి' అనుకునే తల్లిదండ్రులు, భర్త సంపాదన వల్ల మాత్రమే ఆమె బతకాలనుకునే తల్లిదండ్రులు ఆమె చదువును నిర్లక్ష్యం చేయడం గ్రామీణ భారతంలో నేటికీ జరుగుతూనే ఉంది. ఆడపిల్లకు ఆస్తిపాస్తులు ఇచ్చినా చదువు వల్ల వచ్చే, ఆమెకై ఎంచుకునే ఉపాధి నుంచి వచ్చే సంపాదన కలిగించే ఆత్మవిశ్వాసం వేరు. స్త్రీలను 'అదుపులో ఉంచడం' అంటే వారిని ఆర్థిక వనరుల నుంచి దూరంగా పెట్టడమే. కుటుంబపరంగా, సామాజికంగా తన జీవితం ఏ విధంగా గడవాలని స్త్రీ ఆశిస్తుందో ఆ నిర్ణయాన్ని వెల్లడించే శక్తి ఆర్థిక స్వావలంబన వల్ల కలుగుతుంది.

# మళ్లీ క్రియాశీలం..

హైదరాబాద్,తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎట్టకేలకు రాజకీయంగా మళ్లీ క్రియాశీలం అవుతున్నారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమి పాలై.. అధికారానికి దూరమైన క్షణం నుంచీ కేసీఆర్ దాదాపుగా రాజకీయ సన్యాసం పుచ్చుకున్నారా అనే విధంగా యాక్టివ్ పోలటిక్స్ కు దాదాపు దూరమయ్యారు. పూర్తిగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. అడపదడపా పార్టీ నేతలను ఎవరినైనా కలిసినా వారిని ఫామ్ హౌస్ కు పిలిపించుకుని మాట్లాడారే తప్ప ఆ ఫామ్ హౌస్ వీడి బయటకు రాలేదు. పార్టీ పరాజయం పాలైన తరువాత ఇప్పటి వరకూ ఆయన ఫామ్ హౌస్ వీడి బయటకు వచ్చిన సందర్భాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఒక సారి అంటే ఒకే ఒక రోజు అసెంబ్లీకి హాజరయ్యారు. అసెంబ్లీలో ఆయన నోరెత్తింది లేదు. బయటకు వచ్చి మీడియాతో ముక్త సరిగా రెండు మాటలు మాట్లాడి మళ్లీ ఫామ్ హౌస్ కు వెళ్లిపోయారు. తాజాగా ఇటీవల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు ఫామ్ హౌస్ వీడి తెలంగాణ భవన్ కు వచ్చారు. అక్కడా అంతే ప్రసంగం ముగించేసి మళ్లీ ఫామ్ హౌస్ కు చేరిపోయారు. ఇక ఇప్పుడు తాజాగా ఆయన పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. అయితే ఆ సమావేశం కోసం కేసీఆర్ బయటకు రాలేదు. పార్టీ నేతలనే ఫామ్ హౌస్ కు పిలిపించుకున్నారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి పార్టీ దూరంగా ఉండటం, అనూహ్యంగా బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడంతో రాజకీయంగా బీఆర్ఎస్ కథ ఇక ముగిసినట్లేనన్న విశ్లేషణలు వెల్లువెత్తుతున్న సమయంలో కేసీఆర్ పార్టీ నేతలతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆయన తెలంగాణ భవన్ కు రాకుండా నేతలను ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు పిలిపించుకుని మాట్లాడటమే పార్టీ వర్గాలలో ఒకింత అసంతృప్తికి కారణమయ్యింది. ఈ విషయాన్ని పార్టీ నేతలే ప్రైవేటు సంభాషణల్లో చెప్పుకుంటున్నారు. అసలు ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీని పోటీకి దూరం పెట్టడమే ఒక రాజకీయతప్పదమన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. హరీష్ రావు వంటి సీనియర్ నాయకుడు ఈ విషయాన్ని నేరుగా కేసీఆర్ కే చెప్పి.. పార్టీ తరపున అభ్యర్థిని రంగంలోకి దింపుదామని కోరినప్పటికీ కేసీఆర్ వినలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పోటీకి దూరం కావడం వల్ల బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అన్న విమర్శలకు, ఆరోపణలకు బలం చేకూర్చినట్లు అవుతుందని ఎంతగా చెప్పినప్పటికీ కేసీఆర్ పట్టించుకోలేదని అంటున్నారు. సరే మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలలో రెండు బీజేపీ గెలుచుకోవడంతో రాష్ట్రంలో బీఆర్ఎస్ పొలిటికల్ స్పేస్ ను బీజేపీ ఆక్రమించేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఈ తరుణంలో కేసీఆర్ ఫామ్ హౌస్ లో పార్టీ నేతలలో జరిపిన భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు హాజరయ్యారు. అంతా బానే ఉన్నా.. కేసీఆర్ ఈ సమావేశాన్ని తన ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేయడం పట్ల మాత్రం బీఆర్ఎస్ నేతలలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఇలా ఫామ్ హౌస్ లో భేటీల వల్ల ప్రజల దృష్టిలో పలుచన అవుతామన్న ఆందోళనా వారు వ్యక్తం చేస్తున్నారు.

## హోలీరోజే తొలి చంద్రగ్రహణం

తిరుమల, ఈ ఏడాది తొలి చంద్రగ్రహణం హోలీ రోజు ఏర్పడుతుంది. జ్యోతిష్యం ప్రకారం ఈ గ్రహణం ప్రభావం భారతదేశంపై ఏమాత్రం ఉండదని జ్యోతిష్యులు అంటున్నారు.. 2025లో తొలిసారి మార్చి14న హోలీ పండగ రోజే సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. భారత కాలమానం ప్రకారం ఈ చంద్రగ్రహణం అనేది ఉదయం 9 గంటల 27 నిమిషాలకు ప్రారంభమై, ఉదయం 11 గంటల 56 నిమిషాలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. మధ్యాహ్నం 3:29 వరకు ఈ గ్రహణం ఉంటుంది. అయితే చాలా మందిలో హోలీ పండగ రోజే చంద్రగ్రహణం ఏర్పడుతుండటంతో పండగ జరుపుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ, భారత దేశంపై ఈ చంద్రగ్రహణ ప్రభావం ఉ ండదంటున్నారు పండితులు. గ్రహణం పగటి సమయంలో ఏర్పడుతుండటంతో, దీని ప్రభావం భారతదేశంపై ఏమాత్రం ఉండదంటున్నారు. ఇది ఎక్కువగా ఉ త్తర అమెరికా, పశ్చిమ ఆఫ్రికాలో కనిపిస్తుంది. కనుక ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్చి 13న హోలికా దహనం, మార్చి 14న హోలీ పండుగను జరుపుకోవచ్చని సూచిస్తున్నారు. అంతే కాకుండా గ్రహణం ప్రభావం మన దేశంపై ఉండకపోవడం వలన మేషం నుంచి మీన రాశి వరకు ఏ రాశి వారైనా సరే.. వారిపై ఎలాంటి ప్రభావం ఉండని కొందరు పండితులు చెబుతున్నారు.

## హామీల్లో కోతలు..

హైదరాబాద్, మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి.. ఏడాదిన్నర పాలనలో మహిళలకు చేసింది ఎడతెగని వంచనే అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే. మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాధికారులను చెయ్యని చేతగాని సర్కారు మీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేసారని నేడు వేడుకలు నిర్వహిస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏటా 20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుంది కాంగ్రెస్ తీరు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన సమాధానం ప్రకారం, సుమారు రూ. 5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయి ఉంది. బకాయిలే చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. 'మహిళలకు ప్రతి నెల రూ. 2500' ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటి హామీగా చెప్పి ఏడాదిన్నరగా అమలు చేయని రేవంత్ సర్కారు, ఈరోజు ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ. 37,500 ఎప్పుడు చెల్లిస్తారు? రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు మాత్రం గడప దాటవు అని మరోసారి నిరూపితమైంది. గ్యారెంటీలు, 420 హామీలు అని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే రేవంతు సర్కారు, మహిళలను దారుణంగా వంచించింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కేసీఆర్ గారు మహిళా సంక్షేమం, సాధికారత, స్వయం సమృద్ధి కోసం ప్రారంభించిన పథకాలకు మంగళం పాడారు అని హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో కేసీఆర్ కిట్టు బంద్ అయ్యింది. కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ బంద్ అయ్యింది. బతుకమ్మ చీరెలు బంద్ అయినయి. ఆరోగ్య లక్ష్మి బంద్ అయ్యింది. ఆరోగ్య మహిళ బంద్ అయ్యింది. పింఛన్ల పెంపు బంద్ అయ్యింది. కడుపు కోతలు మల్లా పెరిగినయి. పెరిగిన క్రైం రేటుతో ఆడబిడ్డలకు భద్రత కరువైంది. నోటిఫికేషన్లు రాక, యువతుల ఉద్యోగ కలల సాకారం ప్రశ్నార్థకమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకుండా ఇన్నాళ్లూ కాలం వెల్లదీసారు. ఇప్పుడమో అన్నీ చేసినట్లు, మహిళలను కోటీశ్వరులను చేసినట్లు కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్‌రావు మండిపడ్డారు. మీ అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పి, ఏడాదిన్నరగా మాట తప్పిన హామీలను గుర్తు చేస్తున్నాను. మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500. ఇప్పటికీ అమలు లేదు. సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తమన్నరు. అతీగతీ లేదు. 18 ఏళ్లు పైబడి, చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తమన్నరు. ఊసే లేదు. ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఆర్థిక సాయంతో పాటు, తులం బంగారం ఇస్తామన్నరు. జాడే లేదు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రంతో పాటు, ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తమన్నరు. పత్తాలేదు. డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తం అన్నరు. ప్రస్తావన లేదు. పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకాన్ని పునరుద్దరిస్తం అన్నరు. పథకమే లేదు. అంగన్‌వాడీ టీచర్లకు నెలసరి వేతనం 18,000 లకు పెంచుతూ, ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తం అన్నరు. ఆలోచనే లేదు. ఆశా వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచుతం అన్నరు. సోయి లేదు. ఇందులో ఒక్క హామీని అమలు చేయకుండా, నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుందని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## వాతావరణంలో భిన్నమార్పులు

యాదాద్రి భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రజలు చలితో వణికిపోతున్నారు. ఉదయం, రాత్రి చలి వనికిస్తుండడంతో మంటలు కాగుతూ కనిపిస్తున్నారు. గత వారం రోజులుగా వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రత తగ్గిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో రాత్రి వేళలో ఇంటా బయట తిరగడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోయి. గ్రామాల్లో ఉదయం 8,9 గంటల వరకు చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిరు వ్యాపారుల చలికి ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎండాకాలంలో సైతం చలి మంటలకు కాచుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. సాధారణంగా సెప్టెంబర్ నుంచి జనవరి నెలల మధ్య మంచు కురుస్తూ ఉంటుంది. సంక్రాంతి తర్వాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయి. కానీ దీనికి భిన్నంగా మార్చి నెలలోనూ కొన్ని ప్రాంతాల్లో మంచు దుప్పటి కప్పేస్తున్నది. శనివారం ఉదయం సూర్యాపేట జిల్లా చివ్వేంల మండల కేంద్ర శివారుతోపాటు, బీబీగూడెం, అక్కలదేవి గూడెం, సూర్యాపేట–ఖమ్మం రహదారి, హైదరాబాద్–ఖమ్మం రహదారిపై దట్టంగా మంచు కమ్మేసింది. రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. ఉదయం 8 గంటలు అయినా మంచు దుప్పటి వదలకపోవ డంతో ఇదెక్కడి కాలమని, ఒక్కరోజులో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటుండటంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. కాగా, రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొన్నది. ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తర్వాత చలిగాలులు వీస్తున్నాయి. 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

# గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది

హైదరాబాద్/న్యూఢిల్లీ: గుజరా త్ మోడల్‌కు కాలం చెల్లిందని, తెలంగాణ మోడల్ ప్రస్తుతం ట్రెండ్‌లో నడుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్ మోడల్ టెస్ట్ లాంటిదని తెలంగాణ మోడల్ టీ20 అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. శుక్రవారం ఢిల్లీ వేదికగా జరుగుతు న్న 'ఇండియా టుడే కాంక్లేవ్– 2025'లో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ గుజరాత్ మోడల్‌ను టెస్ట్ ఫార్మాట్ తో సి ఎం రేవంత్ పోల్చారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు అంశాలు తెలంగాణ అభివృద్ధి నమూనాను కలిగి ఉన్నాయన్నారు. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లోని మౌలిక సదుపాయాలు, హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలను బేరీజు వేయాలని సిఎం రేవంత్ డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఈ మూడు తెలంగాణ మోడల్ అని పేర్కొన్నారు. అభివృద్ధిలో తాము పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూసుకోవడం లేదని మా పోలిక అంతా న్యూయార్క్, సియోల్, టోక్యో, ఇతర దేశాలతోనే పోటీ అని ఆయన అన్నారు.



35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి

అహ్మదాబాద్‌కు తెలంగాణకు ఎందులోనూ పోలిక లేదని సిఎం రేవంత్ ఛాలెంజ్ చేశారు. దేశవ్యాప్తంగా ఇచ్చే కోవిడ్ వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతు తెలంగాణలోనే తయారవుతున్నాయని, 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ మోడల్ ద్వారా వచ్చే ఐదు సంవత్సరాల్లో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా మారుస్తామన్నారు. 20 వేల ఎకరాల భూమిలో అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సిఎం రేవంత్ తెలిపారు. ఐదేళ్ల తర్వాత తెలంగాణను చూడండి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాన్ని నిర్మించబోతున్నామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు, కెసిఆర్‌తో హైదరాబాద్ అభివృద్ధి ప్రారంభం కాలేదు

హైదరాబాద్ అభివృద్ధి రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కెసిఆర్‌తోనే ప్రారంభం కాలేదని సిఎం రేవంత్ తెలిపారు. కులీ కుతుబ్ షాల నుంచే హైదరాబాద్ అభివృద్ధి మొదలైందన్నారు. వారి తర్వాత నిజాం రాజులు, బ్రిటీషర్లు, స్వాతంత్ర్యం అనంతరం మర్రి చెన్నారెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం, తర్వాత చంద్రబాబు నాయుడు, ఇప్పుడు తాను పని చేస్తున్నానని ఆయన తెలిపారు. 450 ఏళ్ల చరిత్ర హైదరాబాద్‌కు ఉందని, చార్మినార్, గోల్కొండ కోట, సికింద్రాబాద్ కంటోన్మెంట్ లను చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, కెసిఆర్ నిర్మించారా అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న ల్యాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అంతా 450 ఏళ్ల క్రితం ప్రారంభమై రేవంత్ రెడ్డి వరకు నిరంతరంగా వస్తోంద న్నారు. సిఎంలు, పిఎంలు మారినా పాలసీలు మారకుండా హైదరాబాద్ అభివృద్ధి కొనసాగుతుందన్నారు.

దక్షిణాదిపై బిజెపి పగ

నియోజక వర్గాల పునర్విభజన పేరిట దక్షిణ భారతదేశంపై పగ, ప్రతీకారం తీర్చుకోవాలని బిజెపి భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. శుక్రవారంనాడు ఇక్కడ జరిగిన 'ఇండియాటుడే కాంక్లేవ్'లో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%%% డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాల అభిప్రాయాన్నే కాకుండా పంజాబ్‌లాంటి రాష్ట్రాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. దక్షిణ భారతంలో బిజెపికి తగినంత ప్రాతినిధ్యం దక్కడం లేదని, ఈ కారణంగా డీలిమిటేషన్ అనే ఆయుధాన్ని ఆ ప్రాంత ప్రజలపై ప్రయోగించాలని చూస్తోందని దుయ్యబట్టారు. దక్షిణ భారతంలో మొత్తం 240లోక్‌సభ స్థానాలు ఉంటే, అందులో గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి కేవలం 29 మంది మాత్రమే గెలుచుకోగలిగిందని గుర్తు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను అందిపుచ్చుకోవడం ద్వారా లోక్‌సభ స్థానాలుతగ్గించి తద్వారా దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకోవాలని బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. దక్షిణ భారతంలో ఏ ఒక్క రాష్ట్రంలో బిజెపి అధికారంలో లేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ పార్ట్‌నర్‌గా ప్రభుత్వంలో ఉందని రేవంత్ గుర్తు చేశారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియను నిర్వహించాలన్న తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రతిపాదనకు మద్దతునిస్తామన్నారు. కుటుంబ నియంత్రణ అనేది కేంద్రం పరిధిలోని అంశమని, దాన్ని సమర్థంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తారా అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ ప్రక్రియను మరో 30 సవంత్సరాలు నిలుపుదల చేసి చూడండి, అప్పుడు దక్షిణ భారతంలో జనాభా ఏ మేరకు పెరుగుతుందో ఊహించుకోవాలని రేవంత్ రెడ్డి నవ్వుతూ వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్‌పై దక్షిణ భారత రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ విజయవంతం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ఆయా రాష్ట్రాలపై ఉందన్నారు. జనాభా నిష్పత్తి ప్రాతిపదికన జరిగితే ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాలకు మాత్రమే మేలు జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఇటీవల కులగణన జరిగిన తీరు.. వస్తున్న విమర్శలపై కూడా రేవంత్ స్పందించారు. కులాల జనాభాను తేల్చేందుకు కేంద్ర స్థాయిలో కూడా లెక్కింపు జరగాల్సిన అవసరం ఉందన్నారు. బిసిల డిమాండ్ సరైనదే అయితే రిజర్వేషన్ల కల్పన వారికి ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ఇప్పటి వరకు ఏ కులం జనాభా ఎంతో నిర్థిష్టంగా ఎందుకు లెక్కించలేకపోయారని ప్రశ్నించారు. ఏ కంపెనీ అయినా మనుగడ సాధించాలంటే ఆ కంపెనీ ఆస్తులు, టర్నోవర్, లాభ నష్టాలు పక్కాగా లెక్కించుకుంటామని, అలాంటింది దేశానికి కులపరమైన బ్యాలెన్స్ షీట్ ఎందుకు ఉండకూడదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల జనాభా ఎంత ఉ ంటుందో తేల్చుతారు కానీ, బిసిలను ఎందుకు విస్మరించారని రేవంత్ ప్రశ్నించారు. కేంద్రం జరపబోయే జనాభా లెక్కల్లోనే కులపరమైన లెక్కలను కూడా ఈ సారి తేల్చాలని డిమాండ్ చేస్తున్నామని, ఆ దిశగా తీర్మానం కూడా చేసినట్లు వివరించారు. కులగణన ద్వారానే ఆయా వర్గాలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. ఈ ప్రక్రియను పక్కదోవ పట్టించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆయా వర్గాలకు అన్యాయం తలపెడుతోందని ఆరోపించారు.

హిందీ ఆప్షన్ మాత్రమే

భాషా పరమైన వివాదాలపై కూడా సిఎం రేవంత్ నిశ్చితాభిప్రాయాన్ని వెలిబుచ్చారు. హిందీ అనేది ఒక ఆప్షనల్ మాత్రమే అని, తప్పనిసరికాదన్నారు. హిందీని బలవంతంగా రుద్దాలని బిజెపి చూస్తోందని, అయితే ఈ దేశంలో భాషాపరమైన వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అసవరం ఉందన్నారు. హిందీ గురించి మోడీజీ చాలా ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ తెలుగు అత్యధికులు మాట్లాడుతున్న రెండో భాష అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. అసలు తాను హిందీ నేర్చుకున్నదే మోడీ కోసమన్నారు. ఆయనతో రాజకీయ పరమైన యుద్ధం చేయడం కోసమే హిందీలో మాట్లాడుతున్నట్లు రేవంత్ చెప్పారు. ప్రాంతీయ భాషలను విస్మరించలేరని, సివిల్ సర్వీసెస్ పరీక్షల నుంచి తెలుగును తొలగిస్తారా?అన్ని ప్రశ్నించారు. అదే సమయంలో తాను హిందీకి వ్యతిరేకం కాదన్నారు.భాషను ఒక పరరికంగా వాడుకోవాలి తప్ప దాన్నొక అవకాశంగా తీసుకోరాదన్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఇంగ్లీష్‌ను వాడుకోవాల్సి వస్తోందని, కానీ అది మన మాతృభాష కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం గెలుపుకోసం వాడుకుంటోందని ఆరోపించారు. మోడీతో పాటు అదానీతో అంటకాగుతున్నారన్న విమర్శపై రేవంత్ స్పందించారు. ఒక ముఖ్యమంత్రిగా ప్రధానితో ఎలాంటి సంబంధాలు ఉండాలో అలాంటి వాటిని మాత్రమే తాను నిర్వర్తిస్తున్నాని స్పష్టం చేస్తున్నారు. ఒక ముఖ్యమంత్రిగా తాను రాష్ట్రానికి సంబంధించిన అంశాలు, ఆందోళనలు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఈడీ, సిబిఐ, ఇన్‌కంటాక్స్‌లు మోడీకి అనుబంధ సంఘాలు

కాంగ్రెస్‌కు యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఉన్నాయని సిఎం రేవంత్ వెల్లడించారు. కానీ, మోడీకి ఈడీ, సిబిఐ, ఇన్‌కంటాక్స్‌లాంటివి అనుబంధ సంఘాలని సిఎం రేవంత్ విమర్శించారు. అదానీకి రూ.100 కోట్లు వెనక్కి ఇవ్వాలని పార్టీ చెప్పలేదని ఆయన తెలిపారు. మా ప్రతిపక్షాలు బిజెపి, బిఆర్‌ఎస్‌లు వ్యతిరేకించాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు కోసం రూ. 100 కోట్లను తీసుకురావాలనుకున్నా. బిజెపి అదానీ నుంచి తీసుకున్న బాండ్లను ఎందుకు వెనక్కి ఇవ్వలేదని, తాను వెనక్కి ఇచ్చానని ఎటువంటి అపవాదు ఎదుర్కొదల్చుకోలేదని ఆయన తెలిపారు. తాను భద్రాచలంలో రాముడి గుడి ఉందని చెప్పా, మోడీ, అమిత్ షాలను పిలిచినా ఇప్పటి వరకు వారు రాలేదని సిఎం రేవంత్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఒలంపిక్స్‌ను నిర్వహించాలని లేఖ రాశా

%మరోవైపు హైదరాబాద్‌లో ఒలంపిక్స్ నిర్వహించాలని తాను లేఖ రాశానని అయినా స్పందన లేదని సిఎం తెలిపారు. అహ్మదాబాద్ కంటే హైదరాబాద్‌లో ఒలంపిక్స్‌ను నిర్వహించడానికి తమ దగ్గర ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్కువ అని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ ఇప్పటికే మిలటరీ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఆఫ్రో–ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని సిఎం రేవంత్ తెలిపారు. నిఖత్ జరీన్, సానియా మీర్జా, పి.వి.సింధు సహా ఒలింపిక్స్, క్రికెట్లో రాణించిన వారంతా తెలంగాణ నుంచి వచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ సుందరి పోటీలు మేలో హైదరాబాద్‌లో జరగబోతున్నాయని, ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఎందుకు ఒలింపిక్స్ జరగకూడదని ఆయన ప్రశ్నించారు.

# ఏది నాటి ఉద్యాన నగరం?



బెంగళూరు, ఒకప్పుడు పచ్చగా కళకళలాడుతూ, స్వచ్ఛమైన వాతావరణంతో ఉద్యాన నగరంగా పేరొందిన బెంగళూరు నేడు ఐటీ రాజధానిగా మారి కాలుష్యం, రణగొణ ధ్వనులతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లతో, అస్తవ్యస్తమైన రోడ్లు, కట్టడాలతో నిండి ఉండటం పట్ల ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ సామాజిక మాధ్యమంలో చర్చకు దారి తీసింది. 'నిర్మల స్వర్గ ధామం నుంచి ట్రాఫిక్‌తో నిండిన మహా నగరం'గా బెంగళూరు మారిన వైనాన్ని ప్రస్తావిస్తూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, నందన్ నీలేకని చిత్రాలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన రాసిన పోస్ట్ ప్రకారం ఒకప్పుడు బెంగళూరు నగరం నిర్మలమైన స్వర్గధామంగా ఉన్నప్పుడు కబ్బన్ పార్కులో ఉదయపు నడకలు, ప్రీమియర్ పద్మినీ కారులో సరదా డ్రైవింగ్‌లు, మధ్యాహ్న సమయాలలో బుక్‌స్టోర్‌ల్లో కాలక్షేపాలు, సరదా కబుర్లు ఉండేవి. అయితే తెలివైన ఐటీయన్లు తమ జీవిత భాగస్వాముల నుంచి కొంత సొమ్మును పట్టుకొని వెచ్చించారు. దానితో ఇప్పుడు గార్డెన్ సిటీలో చల్లటి గాలిని ఆస్వాదించడానికి బదులుగా ఔటర్ రింగ్ రోడ్‌పై గంటలు గంటలు ఇరుక్కుపోయి కాల ం గడపాల్సి వస్తోంది.వారంతా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. కాగా, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు అనుకూల, వ్యతిరేక కామెంట్లు చేశారు. బెంగళూరులో మౌలిక సదుపాయాలు క్షీణించాయని కొందరు వ్యాఖ్యానించగా, మరికొందరు నగర అభివృద్ధిని, అందులో సాంకేతిక మార్గదర్శకుల పాత్రను ప్రశంసించారు. 'బెంగళూరు సామర్థ్యం గల నగరం. గత రెండు దశాబ్దాలుగా దాని అభివృద్ధి స్పష్టంగా కన్పిస్తున్నది. ఈ రోజుకు కూడా కొత్త సిటీ కన్నా గార్డెన్ సిటీ లాంటి పాత నగరంలోనే రోడ్లు,ఇతర మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. సాంకేతికతను నారాయణ మూర్తి అడ్డుకుంటే ఆయనను నిందించగలము కానీ.. బెంగళూరులోని దయనీయమైన మౌలిక సదుపాయాలకు ఆయనను నిందించలేం కదా. రాజకీయ నాయకుల బిల్డర్ లాబీయే దీనికి కారణం. వారు చెరువులు, కుంటలు ఆక్రమించారు.వారు రోడ్లు వేయలేదు.మౌలిక సదుపాయాలు కల్పించకుండా నగరాన్ని నాశనం చేశారు' అని ఒక నెటిజన్‌ను కలిగి ఉంది. 'బెంగళూరు పరివర్తన నగర పరిణామాలలో ఒక కేసు స్టడీ. దీనికి ఇన్ఫోసిస్, ఐటియన్లకు కృతజ్ఞతలు' అని మరొకరు జరిగింది. అభివృద్ధి, విధ్వంసం పక్కనే ఉంటాయని.. ఈ రెండూ లేకుండా ఒక్కటే కావాలనుకోవడం అత్యాశే అని మరో నెటిజన్ ??కామెంట్ చేశారు.

### సమస్యలపై చర్చిద్దాం ఢిల్లీకి రండి

హైదరాబాద్,ఎంపీల మీటింగ్ కి బీజేపీ ఒక్కటే కాదు ఏ పార్టీ హాజరు కాలేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. రాష్ట్ర ప్రజల హక్కుల కోసం, వాట కోసం కొట్లాడేది బీజేపీ తప్ప ఎవరు లేరన్నారు.

## కాలిఫోర్నియా గవర్నర్ రేసులో కమలాహారిస్

కాలిఫోర్నియా,అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్  జాగా ఆమె కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు వార్తా పత్రికల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు కార్యక్రమాల్లో కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధమైనట్లు సూచనప్రాయంగా తెలిపారు. మరికొన్ని రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక, ఆమె 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దశాబ్దాలుగా కాలిఫోర్నియా వాసులు డెమోక్రట్లకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆమె ఈ ఎన్నికల్లో పోటీకి దిగితే.. తప్పక విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ఄసబీపూ)పై డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ పోటీ చేసి ఓడిపోయారు. అధికారం చేజిక్కించుకోవడానికి కీలకమైన స్వింగ్ రాష్ట్రాలను సొంతం చేసుకుంటూ ట్రంప్ 312 ఎలక్టోరల్ ఓట్లతో విజయం సాధించగా, హారిస్ 226 ఎలక్టోరల్ ఓట్లను కైవసం చేసుకున్నారు. ఓటమి అనంతరం హారిస్ మాట్లాడుతూ.. కొన్నిసార్లు సానుకూల ఫలితాలకు సమయం పడుతుందని.. అంతేకాని గెలవలేమని కాదని పేర్కొన్నారు. స్వేచ్ఛ, న్యాయం, భవిష్యత్తు కోసం మళ్లీ నిలబడాల్సిన, నిమగ్నం కావాల్సిన సమయం ఇదేనని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు.

## సాగునీటి కోసం రైతుల ఆందోళన

కాకినాడ,సాగునీరు సక్రమంగా అందడం లేదని తాళ్లరేవు నీటి పారుదల శాఖ ఏఈఈ కార్యాలయం వద్ద  రహదారిపై రైతులు  బైఠాయించి శనివారం పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రైతుల ఆందోళనకు మద్దతు తెలిపి ప్రభుత్వం తక్షణమే ఎద్దడి లేకుండా సాగునీటిని అందించాలని, అందుకు అధికారులు తగిన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. రాజశేఖర్, వల్లు రాజబాబు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

## చైనా, పాక్‌ల మధ్య కుట్రపూరిత బంధం

న్యూఢిల్లీ,చైనా, పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండింటి మధ్య ఉన్న కుట్రపూరిత సంబంధాలను భారత్  తప్పక అంగీకరించాల న్నారు. ఈమేరకు ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 'వర్చువల్ డొమైన్‌లో ఆ రెండు దేశాల మధ్య బంధం వందశాతంగా ఉంది. భౌతికంగా పరిశీలిస్తే.. చైనాలో తయారైన మిలిటరీ ఉత్పత్తులను పాక్ వినియోగిస్తోంది. రెండువైపుల నుంచి యుద్ధ ముప్పు ఉందనేది వాస్తవం. అలాగే వేసవి సమీపిస్తున్నకొద్దీ జమ్మూకశ్మీర్‌లో చొరబాట్లు పెరిగే అవకాశం ఉంది. సరిహద్దుల వెంబడి చొరబాట్లు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఉగ్రవాదుల కదలికలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది' అని ద్వివేది వెల్లడించారు.  ఇక, ఉగ్రవాద కట్టడికి భారత సైన్యం గట్టి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈవిషయంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. 2018 నుంచి ఉగ్రవాద ఘటనల సంఖ్య 83 శాతం తగ్గాయన్నారు. కేవలం 45 మంది మాత్రమే ఉగ్ర కార్యకలాపాల వైపు ఆకర్షితులయ్యారని చెప్పారు. సైన్యం చర్యలతో పర్యటకం పెరిగిందన్నారు.

## పెద్దన్న పాత్ర.. అంగీకరిస్తారా?

చెన్నై:దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీయేతర పక్షాలు ఏకమవ్వాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునివ్వడం ఆసక్తిరేపుతోంది. దక్షిణాది రాష్ట్రాలతోపాటు పశ్చిమబెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లోని ముఖ్య నేతలు కూడా తమతో చేతులు కలపాలని స్టాలిన్ కోరుతుండటం హాట్ టాపిక్ గా మారింది. వయసు రీత్యా స్టాలిన్ కూడా మోస్ట్ సీనియర్ అయినా ఆయన కంటే సీనియర్ నేతలుగా దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఒడిసా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటివారికి స్టాలిన్ లేఖ రాయడమే ఇంట్రస్టింగ్ గా చెబుతున్నారు. వీరిలో చంద్రబాబు తప్ప మిగిలిన వారంతా ప్రస్తుతం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నవారే..దక్షిణాదితో పాటు జనాభా నియంత్రణ పాటించిన ఒడిసా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లో పార్లమెంటు సీట్లు తగ్గే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కట్టుదిట్టమైన జనాభా నియంత్రణ పాటించి క్రమశిక్షణగా ఉండటమే తమ తప్పా అంటూ ఆయా రాష్ట్రాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెబుతున్నారు. అదేవిధంగా పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఇదే పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు. పార్లమెంటు సీట్లు తగ్గిపోతే తమ రాష్ట్రాల గళం వినిపించే అవకాశం తగ్గిపోతుందని ఆయా రాష్ట్రాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అయితే పునర్విభజనపై అనవసర ఆందోళనలు వద్దని కేంద్రం చెబుతున్నా, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం బీజేపీ పెద్దల మాటలను నమ్మడం లేదు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తోపాటు ఆయా రాష్ట్రాల్లోని బీజేపీయేతర పార్టీలు కేంద్రంపై పోరాటానికి పిలుపునిస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే చెన్నైలో ఈ నెల 27న 29 పార్టీలతో సమావేశం నిర్వహించాలని తమిళనాడు సీఎం స్టాలిన్ భావిస్తున్నారు. ఈ సమావేశానికి ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆయన ఆహ్వానించారు. ఈ ఏడు రాష్ట్రాల్లోని 29 పార్టీల అధ్యక్షులతోపాటు మాజీ సీఎంలు జగన్, కేసీఆర్, నవీన్ పట్నాయక్ వంటివారిని సమావేశానికి రావాల్సిందిగా స్టాలిన్ ఆహ్వానించడం విశేషంగా చెబుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం ఉమ్మడి కార్యాచరణ ప్రకటిద్దామని స్టాలిన్ పిలుపునిస్తున్నా, భిన్న ధ్రువాలైన పార్టీల నేతలను ఈ సమావేశానికి ఆహ్వానించడమే ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయగలిగే స్థితిలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీదీ హాజరుకాకపోయినా, ఆమె తరఫున ప్రతినిధులను పంపే అవకాశం ఉందంటున్నారు. కానీ, ఏపీ సీఎం చంద్రబాబు వెళ్లే అవకాశాలు లేవనే చెబుతున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ తో వ్యక్తిగతంగా చంద్రబాబుకు మంచి సంబంధాలు ఉన్నప్పటికీ బీజేపీకి వ్యతిరేకంగా జరిగే

# జగన్ లాగానే కేసీఆర్ కూడానా ?



అమరావతి,ఏపీలో జగన్ చేసినట్లే తెలంగాణాలో కేసీఆర్ చేయబోతున్నారా అంటే ప్రస్తుతానికి అయితే అదే అనిపిస్తోంది అని అంటున్నారు. ఈ ఇద్దరికీ వయసులో రాజకీయ అనుభవంలో తేడా ఉండొచ్చు కానీ ఆలోచనలు వ్యూహాలు ప్రత్యర్థుల విషయంలో వారి విధానాల విషయంలో కొన్ని పోలికలు ఉంటాయని అంటున్నారు.ఈ ఇద్దరూ ఒక పట్టాన రాజీపడరు. తాము అనుకున్నదే చేస్తారు. తమకు ఉన్న ప్రజా బలం మీద అపారమైన నమ్మకం. అదే విధంగా విపక్ష పాత్ర పోషించటానికి ఇద్దరికీ అంతగా ఇష్టం ఉండదని లేదని అంటున్నారు. తెలంగాణాలో చూసుకుంటే మాజీ సీఎం కేసీఆర్ గత ఏడాది జరిగిన బడ్జెట్ సమావేశాలలో ఒకసారి మెరిసారు. ఆ తరువాత ఆయన మళ్ళీ రాలేదు.ఈ మధ్యలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా తెలంగాణా అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం జరిపినా కేసీఆర్ హాజరు కాలేదు. మన్మోహన్ సింగ్ కేబినెట్ లో కొన్నాళ్ళ పాటు మంత్రిగా కేసీఆర్ పనిచేశారు. ఆయన ప్రధానిగా ఉండగానే తెలంగాణా రాష్ట్రం వచ్చింది. అందుకైనా ఆయన వస్తారు అనుకున్నా హాజరు కాలేదు. స్పీకర్ స్వయంగా రమ్మని ఫోన్ లో కోరినా రాలేదు.ఇక ఇపుడు చూస్తే ఈ నెల 12 నుంచి తెలంగాణా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా అంటే ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే రావచ్చు అని అంటున్నారు. కేసీఆర్ గత ఏడాది చేసినట్లుగానే సభకు ఒక రోజు వచ్చి కొంత సేపు కూర్చుని ఆ మీదట ఆయన మీడియా పాయింట్ వద్ద తాను చెప్పాల్సింది చెప్పేసి వెళ్ళిపోతారు అని అంటున్నారు.నిజానికి కేసీఆర్ సభకు హాజరు కావాలని అధికార కాంగ్రెస్ కోరుతోంది. ఆయన పదేళ్ల పాలన తీరును సభలోనే ఎండగడతామని అంటోంది. కేసీఆర్ కూడా సమాధానం చెప్పుకోవచ్చని అంటోంది. అయితే కేసీఆర్ మాత్రం రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్న సభలో హాజరు కాకూడదని భావిస్తున్నారు అని అంటున్నారు. అంతే కాకుండా తనను నేరుగా టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తూంటే సభలో ఉండాల్సిన అవసరం ఉండా అని అంటున్నారు.మరో వైపు చూస్తే కనుక ఏపీలో జగన్ కూడా బడ్జెట్ సెషన్ లో ఒక్క రోజే హాజరు అయి సభ నుంచి వెళ్ళిపోయారు. ఆయన కూడా గత ఏడాది ఇదే విధంగా చేశారు. జగన్ కూడా సభలో ఉండేందుకు ఇష్టపడటం లేదు. జగన్ సభకు వస్తే ఆయన అయిదేళ్ళ పాలన మీద ఎండగట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. కానీ జగన్ వారికి ఆ చాన్స్ ఇవ్వదలచలేదు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు అని అంటున్నారు.ఆ హోదా ఎటూ ఇవ్వరనే తెలిసి ఆయన ఈ మెలిక పెట్టారని అంటున్నారు. ఇలా జగన్ సభకు హాజరు కాకపోవడానికి తప్పు అంతా అధికార కూటమి మీదనే పెడుతున్నారు. కానీ తాము అలా ఇవ్వలేమని అధికార పార్టీ చెబుతోంది. సో జగన్ కూడా విపక్షంలో కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు.కేసీఆర్ విషయం తీసుకుంటే ఆయనకు ప్రధాన ప్రతిపక్ష హోదా అయితే ఉంది. కానీ ఆయన సభకు రావడం లేదు. తనకంటే వయసులో చిన్న వారు అయిన రేవంత్ రెడ్డి సభలో ఉండడం తనను కాంగ్రెస్ నాయకులు లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తారని ఆలోచించి తప్పుకుంటున్నారని చెబుతున్నారు. ఇవన్నీ చూస్తుంటే కేసీఆర్ జగన్ ఒకే విధమైన ఆలోచనలతోనే ప్రయాణం చేస్తున్నారు అని అంటున్నారు. తెలుగునాట రెండు చోట్లా ప్రధాన ప్రతిపక్ష నాయకులు లేకుండా సభలు జరుగుతున్నాయి. దాంతో చప్పగా ఉంటున్నాయని అంటున్నారు.

# పవన్ పార్టీ ఇమేజ్ ను దెబ్బేస్తున్న అనుకూల మీడియా?



అమరావతి,ఒక పార్టీకి చెందిన నేత ఒకరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే.. అతడ్ని వెనకేసుకొచ్చినట్లుగా వ్యవహరిస్తే.. సదరు నేత తీరును తప్పు పట్టటమే కాదు.. పార్టీని సైతం విమర్శించటంలో అర్థముంది. అందుకు భిన్నంగా పార్టీ అధినేత వాయు వేగంతో స్పందించి.. తప్పుడు పనికి పాల్పడిన నేత మీద చర్యల కత్తి ఝుళిపిస్తే.. తప్పుడు పని చేసిన వాడి తప్పును.. అదే సమయంలో పార్టీ అధినేత తీరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ..సమాచారం ఇవ్వటం మీడియా చేయాల్సిన పని. అందునా అనుకూల మీడియా అన్న ట్యాగ్ లైన్ ఉన్న సంస్థలు ఇలాంటి అంశాల్లో పవన్ను హీరోగా చూపించే ప్రయత్నం చేస్తాయి. అందుకు భిన్నంగా వ్యవహరించిన తీరు ఇప్పుడు ఆసక్తికరంగానే కాదు.. చర్చనీయాశంంగా మారింది.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు తీరును సరైనోడు ఎవరూ సమర్థించలేరు. తన ఈగో కోసం ఒక వైద్యురాలి మీద దురుసుతనాన్ని ప్రదర్శించటం.. నోటికి పని చెప్పటం.. అందరి ముందు అవమానించేలా వ్యవహరించటంతో పాటు.. పార్టీ ఇమేజ్ ను దారుణంగా డ్యామేజ్ చేసేలా వ్యవహరించిన తీరును తప్పు పట్టాల్సిందే. మిగిలినరాజకీయ పార్టీలు అయితే.. ఇలాంటి అంశాల్ని చూసిచూడనట్లుగా వ్యవహరిస్తాయి.కానీ.. జనసేన మాత్రం అందుకు భిన్నంగా ఆసుపత్రిలో రచ్చ చేసిన తమ నేత తీరుపై నివేదిక తెప్పించుకోవటం.. తప్పుచేసిన విషయాన్ని గుర్తించటం.. ఏ ఆసుపత్రిలో అయితే రచ్చ చేశాడో.. అక్కడే అందరి ఎదుట.. చివరకు అవమానానికి గురైన వైద్యురాలి తల్లిని కూడా రప్పించి.. అందరి ఎదుట క్షమాపణలు చెప్పించటమే కాదు.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయటం చిన్న విషయం కాదు కదా?ఈ మొత్తం ఎపిసోడ్ లో జనసేనాని తీరును ప్రత్యేకంగా ప్రస్తావించాలి కదా? పొగడ్తలు లేకున్నా.. జరిగిన ఘటనకు సంబంధించి పార్టీ స్పందించిన తీరును ఉన్నది ఉన్నట్లుగా చెప్పాల్సి ఉంటుంది కదా? అందుకు భిన్నంగా జనసేన నేత దురుసు ప్రవర్తన అంటూ పార్టీ ఇమేజ్ ను దెబ్బ తీసేలా మీడియాలో వార్తల్ని ఇవ్వటం ఏమిటి? అన్నది ప్రశ్న. ఇంతా చేసి.. పార్టీకి వ్యతిరేక మీడియాలో ఇలాంటివి వచ్చాయన్నా అర్థం చేసుకోవచ్చు. అందుకు భిన్నంగా ఏపీ అధికార కూటమికి అనుకూలంగా ఉంటుందన్న ఇమేజ్ ఉన్న మీడియా సంస్థల్లోనూ ఉన్నది ఉన్నట్లుగా వార్తలు రాకపోవటం దేనికి నిదర్శనం? అన్నది ప్రశ్న.అదేదో కావాలని.. కల్పించుకొని మరీ పొగడ్తల్ని వండి వార్చాలని కోరుకోవటం లేదు. కనీసం.. ఉన్నది ఉన్నట్లుగా చూసినప్పుడైనా.. జనసేన పార్టీ తీరు మిగిలిన రాజకీయ పార్టీలకు ఎంత భిన్నమో.. పార్టీ అధినేత తీరు ఎంత కచ్చితంగా ఉంటుందన్న విషయాన్ని ప్రస్తావించాలి కదా? తప్పు చేసినోడు తనోడైనా.. న్యాయం వైపు మాత్రమే నిలిచే తీరును ప్రదర్శించిన జనసేనానిని అభినందించక పోయినా ఫర్లేదు.. డ్యామేజ్ చేసేలా వ్యవహరించకూడదు కదా? అన్నదే అసలు పాయింట్. ఈ విషయాన్ని సదరు మీడియా సంస్థలు ఎందుకు మిస్ అయినట్లు?

# కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురు ఆణిముత్యాలేనా?



హైదరాబాద్,ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల వేళ దెబ్బ పడిన తెలంగాణ అధికారపక్షం.. అపకీర్తిని మూటకట్టుకుంది. అధికారం చేతిలో ఉన్న వేళలోనూ సిట్టింగ్ సీటును చేజార్చుకోవటం వెనుక పక్కా కసరత్తు జరగలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. దీనికి అగ్రనాయకత్వం మొదలు రాష్ట్ర నాయకత్వం వైఫల్యాలే ఓటమికి కారణాలుగా భావిస్తున్న పరిస్థితి. ఇలాంటి వేళ.. తాజాగా జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల(ఎమ్మెల్యేల కోటా)కు అభ్యర్థుల ఎంపిక ఎలా సాగుతుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.సంఖ్యా బలాన్ని పరిగణలోకి తీసుకుంటే నాలుగు స్థానాల్లో పోటీ చేసే వీలున్నా.. మిత్రధర్మాన్ని పాటిస్తూ మూడు స్థానాలకు పరిమితం కావటం తెలిసిందే. తాజాగా ప్రకటించిన అభ్యర్థులు ముగ్గురు ముగ్గురే అన్న మాట వినిపిస్తోంది. పార్టీని నమ్ముకొన్న వారు.. పార్టీకి సుదీర్ఘకాలంగా విధేయతతో వ్యవహరించిన వారికే కేటాయింపులు జరిపారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ముగ్గురు అభ్యర్థుల బ్యాక్ గ్రౌండ్ ను.. పార్టీ విషయంలో వారు వ్యవహరించిన తీరును చూస్తే ఈ విషయం అర్థమవుతుందని చెప్పాలి. కొందరు రాజకీయ నేతలు ఎంత కష్టపడినా.. లక్ మాత్రం ఉండదు. ప్రతికూల పరిస్థితుల్లో టికెట్ వచ్చి ఓడిపోవటం.. పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు పార్టీ టికెట్ ఇవ్వకపోవటం లాంటివి జరుగుతాయి అలాంటి కోవలోకే వస్తారు అద్దంకి దయాకర్. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ వర్గానికి చెందిన అద్దంకి దయాకర్ కు టికెట్ కేటాయింపు విషయం వెల్లడైనంతనే.. పార్టీలోని అన్ని వర్గాల నుంచి వచ్చిన మాట.. ఎట్టకేలకు న్యాయం జరిగిందని. ఎందుకంటే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ ఆయనకే కేటాయిస్తారన్న ప్రచారం సాగింది.అనూహ్య పరిణామాలతో అద్దంకి దయాకర్ కు కాకుండా సామేల్ కు టికెట్ దక్కింది. కట్ చేస్తే.. 2024 లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ టికెట్ ఇస్తామని పార్టీ మాట ఇచ్చినా అది కూడా నెరవేరలేదు. చివర్లో హ్యాండ్ ఇచ్చిన పరిస్థితి. దీంతో.. పని చేసి.. పార్టీకి వినయవిధేయతలతో వ్యవహరించే వారికి టికెట్లు ఇవ్వరా? అన్న ప్రశ్న తలెత్తింది.ఈ విమర్శలకు తాజాగా అభ్యర్థిగా ఎంపిక చేస్తూ ఫుల్ స్టాప్ పెట్టేసింది కాంగ్రెస్ అధినాయకత్వం. 1971 ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నెమ్మికల్ గ్రామంలో పుట్టిన అద్దంకి ఉన్నత విద్యావంతుడు. పీహెచ్ డీ పూర్తిచేసిన ఆయన 2014, 2018లో తుంగుర్తి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. పీసీసీ అధికార ప్రతినిధిగా పని చేసిన ఆయన ఎట్టకేలకు ఈ ఎన్నికలతో ప్రజాప్రతినిధి కానున్నారని చెప్పాలి.ఎస్టీ వర్గానికి చెందిన శంకర్ నాయక్ 1972లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కేతావత్ తండాలో పుట్టారు. వ్యవసాయం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1998 - 2001 వరకు దామెరచర్ల మండలం కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. 2001, 2014 స్థానిక ఎన్నికల్లో దామెరచర్ల జనరల్ సీటు నుంచి జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన ఎస్టీగా ఆయనదో హిస్టరీ. 2006-11 వరకూ దామెరచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా.. 2011-14 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. 2016-19 వరకు మిర్యాలగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. 2019 నుంచి నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.ప్రజల్లో పేరుతో పాటు.. అగ్రనాయకురాలిగా గ్లామర్ ఉన్నప్పటికీ రాజకీయంగా సరైన స్థానానికి ఎదిగే విషయంలో విజయశాంతి ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. సొంతంగా పార్టీ పెట్టినప్పటి నుంచి వివిధ పార్టీల్లో పని చేసినప్పటికి ఆమెకు సరైన పదవులు దక్కలేదు. ఎన్నికల్లో గెలిచినా.. ఆమె తీసుకున్న నిర్ణయాల కారణంగా ఆమెకు దక్కాల్సిన పదవులు దక్కలేదని చెప్పాలి. బీఆర్ఎస్.. బీజేపీలో పని చేసిన ఆమె.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కాస్త ముందుగా కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె.. తనకు ఏదో ఒక పదవి ఇవ్వాలన్న మాట తీసుకొని పార్టీలో చేరినట్లుగా చెబుతారు.గతంలో తనకు ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడుకున్న ఆమెకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయటంతో.. ఆమెకు ఇచ్చిన మాటను పార్టీ నిలబెట్టుకున్నట్లుగా చెప్పుకోవాలి. బీసీ నినాదంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పలువురు బీసీ నేతలు ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఆ కోటాలో బీసీ వర్గానికి చెందిన విజయశాంతికి టికెట్ ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. మొత్తంగా తాజాగా ఎంపిక చేసిన అభ్యర్థులు అసలుసిసలు ఆణిముత్యాలుగా అభివర్ణిస్తున్నారు.

# వర్మను ముంచేస్తున్న అనుచరగణం!




అమరావతి,టీడీపీ నాయకుడు.. ఎస్‌వీఎస్ వర్మ.. ఉరఫ్ పిఠాపురం వర్మగా పేరు తెచ్చుకున్న ఆయన పదవి కోసం వేచి చూస్తున్న విష యం తెలిసిందే. గత ఎన్నికల్లో టికెట్‌ను త్యాగం చేసిన ఆయనకు ఎమ్మెల్సీ సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే.. దాదాపు ఏడాది పూర్తవుతున్నా.. ఆయనకు అవకాశం చిక్కలేదు. ఇప్పటి వరకు రెండు సార్లు ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అయ్యాయి. వీటిలో ఒక్కటైనా తనకు దక్కుతుందని వర్మ భావించారు. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ స్థానంలో అయినా పోటీ చేయాలని అనుకున్నారు. కానీ, పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.ఇక, తాజాగా మూడోసారి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ చేస్తున్నా.. వర్మకు అవకాశం దక్కలేదు. ఆదివారం మధ్యా హ్నం వరకు వర్మ తన అనుచరులతో వేచి చూశారు. తనకు ఈ దఫా టికెట్ ఖాయమని అనుకున్నారు. కానీ, పార్టీ నుంచి ఉలుకు పలుకు లేకపోవడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని ఆయన వెళ్లిపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎం చంద్రబాబు స్వయంగా వర్మకు ఫోన్ చేసినా.. ఆయన స్విచ్ ఆఫ్‌లో ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే.. ఇలా ఎందుకు జరుగుతోంది? అనేది ప్రశ్న. దీనికి రెండు కారణాలు ఉన్నాయని అంటున్నారు పరిశీలకులు.వ్యక్తిగతంగా ఇమేజ్ ఉన్న నాయకుడిగా వర్మకు మంచి పేరుంది. ఇది మంచిదే అయినా.. ఈ క్రమంలో ఆయన రెండో అధికార కేంద్రం అవుతారన్న చర్చ సాగుతోంది. పిఠాపరంలో ఇప్పటికే జనసేన-టీడీపీ వర్గాల మధ్య అంతర్గత రగడలు కొనసాగుతున్నా యి. పైస్థాయిలో నాయకులు ఎలా ఉన్నా.. క్షేత్రస్థాయిలో పిఠాపురంలో మాత్రం వర్మ అనుచరగణానికి జనసేన వర్గానికి మధ్య వివాదాలు నిత్యం సాగుతూనే ఉన్నాయి. వీటిని కంట్రోల్ చేయడంలో వర్మ విఫలమవుతున్నారు. దీంతో ఇప్పుడు ఆయనకు పదవి ఇస్తే.. ఇక్కడ అంటే.. పిఠాపురంలో రెండో అధికార కేంద్రం క్రియేట్ అయినట్టేనన్న భావన ఉంది.మరోవైపు.. గత ఏడాది ఎన్నికలకు ముందు టికెట్ రాదని తెలిసిన తర్వాత.. పిఠాపురంలో పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను తగలబెట్టారు. దీనికి వర్మకు అత్యంత సన్నిహితుడే ముందుండి ప్లాన్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై చంద్రబాబు జోక్యం చేసుకుని సదరు సన్నిహితుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. కానీ, వర్మ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామం కూడా.. ఆయనకు పార్టీలో మైనస్ అయినట్టు తెలుస్తోంది. అందుకే చంద్రబాబు వేచి చూసే ధోరణిలో ఉన్నారని.. ఇప్పటికిప్పుడు పదవి ఇస్తే.. పిఠాపురంలో జనసేన-టీడీపీ వర్గాల మధ్య మరింత వివాదం చోటు చేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే.. ఇవే కారణాలా? ఇంకా ఏవైనా ఉన్నాయా? అనే చర్చ కూడా ఉండడం గమనార్హం.

# నవ్వులపాలు అవుతున్న చంద్రబాబు పిలుపు



విజయవాడ:"ముగ్గురు వద్దు- ఇద్దరు హద్దు- ఒక్కరు ముద్దు" అనేది గత కొన్ని దశాబ్దాలుగా మన దేశంలో వస్తున్న కుటుంబ నియంత్రణ సూత్రం.అధిక జనాభాని అరికట్టడం కోసం పాలకులిచ్చిన పిలుపు అది. ఆ లెక్కని అర్థం చేసుకుని ముందుకు వెళ్తున్నారు ప్రజలు.ఇప్పుడు తాజాగా ఆంధ్రలో చంద్రబాబు, తమిళనాట స్టాలిన్ "పిల్లల్ని కనండహో" అని పిలుపులిస్తున్నారు.ఎంతమందిని కంటే అంత డబ్బిస్తానని ఆశ కూడా చూపిస్తున్నారు.తాజాగా విజయనగరం తెలుగుదేశం ఎంపీ కాలిశెట్టి అప్పలనాయుడు, "అధికంగా మగ పిల్లల్ని కంటే, ఒక్కో పిల్లాడికీ ఒక్కో ఆవునిబీ అదే ఆడపిల్లైతే ఒక్కో ఆడపిల్లకి రూ 50,000 తమ పార్టీ ఇస్తుంది" అని ప్రకటించాడు.ఈ ప్రకటన జాతీయ మీడియా స్థాయిలో నవ్వుల పాలౌతోంది.ఇంతకీ ఎందుకు ఈ జనాభా పెరుగుదల మీద అంత దృష్టి అంటే, జనాభా ప్రాతిపదికన ఎంపీ నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. ఎక్కువ ఎంపీ సీట్లు కావాలంటే ఎక్కువ జనాభా ఉండాలట. అందుకే రాష్ట్రానికి ఎక్కువ ఎంపీ సీట్లు తెప్పించడం కోసం ప్రజలు పడకగదుల్లో ఉద్యమించాలని ఆ పిలుపు యొక్క సారాంశం.ఇంతకంటే సిగ్గుమాలిన, దిక్కుమాలిన రాజకీయ ప్రకటన మరొకటి ఉండదు.ఇంతకీ కన్న ప్రతి బిడ్డకీ రూ 50,000 సరే. దానికి కక్కుర్తి పడి పేద ప్రజలు కనడం మొదలుపెడితే పిల్లల్ని పెంచడానికి డబ్బులెవరిస్తారు? రూ 50,000 సరిపోతాయా?"చిన్న కుటుంబం చింత లేని కుటుంబం" అనేది కేవలం ఒక వాక్యం కాదు. ఎందరికో స్వానుభవంలో ఉన్న విషయం.అయినా ఆంధ్రప్రదేశులో ఉన్న జనాన్ని సంతృప్తి పరచడానికే ప్రభుత్వాలు చస్తున్నాయి. కనీస వనరులు కల్పించడం, రోడ్లు వేయడం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి వాటిని ఎదుర్కొంటూ నానా చావూ చస్తున్నాయి. ఆదాయం లేక చంద్రబాబు ఇప్పటి వరకు కేంద్రం నుంచి యాచించి తెచ్చిన డబ్బు అంతా ఇంతా కాదు. మరి ఏం చూసుకుని జనాభా పెంచేయాలంటున్నాడాయన?ఒకవేళ పెరిగిన జనాభా తనకి, తన కొడుకు రాజకీయ లబ్ధికి ఉపయోగపడుతుందనుకుంటే కొత్తగా సంతానాన్ని కనమని పిలుపులివ్వడం దేనికి? ఇప్పటికే బీహార్, జార?ండ్, ఒడిషా, బెంగాల్ ల నుంచి ఎందరో కూలి పనులు గట్రా చేసుకోవడానికి రాష్ట్రానికి వస్తున్నారు. అలా వచ్చినవాళ్లందరికీ లోకల్ రేషన్ కార్డులిప్పించి, లోకల్ అడ్రస్ తో ఆధార్ కార్డులు మార్పించి వాళ్లంతా తమ జనాభానే అని చెప్పుకోవచ్చు. ఇవ్వచూపే డబ్బేదో వాళ్లకే ఇవ్వొచ్చు. అలాంటి ప్రకటన ఏదైనా చేయొచ్చు. ఆ రకంగా దేశ జనాభా ఒక చోటు నుంచి మరో చోటికి మారుతుంది తప్ప కొత్తగా పుట్టుకురాదు.పిల్లల్ని కనమని పిలుపునివ్వడం మాత్రం ఘోరం. ఇన్నాళ్లూ, ఇన్నేళ్లూ ముస్లిములు ఎక్కువమంది పిల్లల్ని కంటున్నారు అంటూ గోల చేసిన వర్గాలు కూడా ఇప్పుడు తమ రాజకీయ లబ్ధికోసం అందర్నీ పిల్లల్ని కనమని చెప్పడం నీతిమాలినతనం.ఇలాంటి పిలుపులు ప్రజలకి ఇచ్చేకన్నా సొంత కుటుంబసభ్యులకి, సొంత ఎంపీ ఎమ్మెల్యేలకి, కేడర్ కి ముందు ఇవ్వొచ్చుగా. అబ్బే వాళ్లు పడరు మరి. ప్రజల్లో కూడా విద్యావంతులు, బుర్ర బుద్ధి ఉన్నవాళు పడరు. ఎటొచ్చీ అమాయిక పేదలు అప్పటికి వచ్చే డబ్బు కోసం వలలో పడొచ్చు.తీరా కన్నాక ఇస్తారన్న గేరెంటీ అడుగుతారో లేదో కూడా తెలీదు. ఎందుకంటే ఇప్పటికే సూపర్ సిక్స్ వాగ్దానాలు ఏవీ నిలబెట్టుకోని ప్రభుత్వం తెదేపాది. ఇప్పుడూ కొత్తగా ఇది "సూపర్ సెవెన్" పాయింటన్నమాట.జనానికి చంద్రబాబు ప్రభుత్వం మీద నమ్మకం కలగాలి, ఇలాంటి కుయుక్తులు నడవాలంటే.సూపర్ సిక్స్ అమలుచేయట్లేదు సరేనీసం స్పెషల్ స్టాటస్ తెచ్చుకోలేదా ప్రభుత్వం? అది పార్లమెంటు స్థాయిలో ప్రామిస్ చేసిందే కదా. ఆ ప్రామిస్ ని నిలబెట్టే విధంగా కేంద్రాన్ని కోరలేడా చంద్రబాబు? కోరినా ఇవ్వరని తెలిసి కోరట్లేదా? కోరే ధైర్యమే లేదా?ఆ స్పెషల్ స్టాటస్ పాయింట్ మీదే కదా తెదేపా భాజపాతో తెగతెంపులు చేసుకుని రాష్ట్రోద్ధారక ఫోజు కొట్టింది 2019 ఎన్నికల ముందు? మరి ఇప్పుడు భాజపా, తెదేపా రెండూ ఒక గూట్లోని రామచిలుకలేకదా? అయినా స్పెషల్ స్టాటస్ రదా? అసలొద్దా?"అసలు చంద్రబాబు వల్లే రాష్ట్రానికి కేంద్రం బోలెడంత అప్పు ఇస్తోంది" అంటూ ఒక తెలుగు తమ్ముడు పోస్ట్ పెట్టాడు.నాయనా! అలాంటి అప్పులు, గ్రాంట్లు కేంద్రం అస్సాం కి కూడా ఇస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వమున్న తెలంగాణాకి కూడా ఇస్తోంది. ఆ మాటకొస్తే ప్రతీ రాష్ట్రానికీ ఇస్తోంది. అప్పు తేవడం కూడా కళేనా?చంద్రబాబు వస్తే అభివృద్ధి పరుగులు తీస్తుంది, రియల్ ఎస్టేట్ ఉరకలు వెస్తుంది అంటే ఏదీ జరగట్లేదు. అన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. పేపర్ మీద, పెదవి మీద మెదిలే మాటలే తప్ప చేతల్లో కనపడేవి లేవు.అయినా అదేమి ఖర్మో కానీ సరిగ్గా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా వరదలు ముంచెత్తడం, అమరావతి సొంతం మునిగిపోయి..ఆ ప్రాంతం మీద ఇన్వెస్టర్లకి నమ్మకం సడలిపోవడం జరిగిపోయాయి. ఇప్పుడు ఎంత లేపుదామనుకున్నా అమరావతిలో రియల్ బూం రావట్లేదు. దానికి తోడు ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు కుప్ప కూలి ఎందరి పెట్టుబడులో ఆవిరైపోయిన పరిస్థితి. బూం తేలేకపోవడానికి ఇది కూడా ఖర్మే.అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ అని ప్రకటిస్తే సొంత వర్గం జనాలే "అమరావతిలో ఎయిర్పోర్ట్ పూర్తిగా అనవసరం, గన్నవరం ఎయిర్పోర్ట్ నే పెద్దది చేసుకోవచ్చు" అంటూ పోస్టులు పెడుతున్నారు.ఏం లెక్కలు చూసుకుని, ఏం రియల్ ఎస్టేట్ లబ్ధిని ఆశించి పాలకపక్షం అమరావతిలో ఎయిర్పోర్ట్ అందో కానీ గన్నవరం చుట్టుపక్కల ఉన్న సొంత జనమే అడ్డు చెప్తున్నారు.సరే..ఇలా నానారకాల రాజకీయ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తెదేపాకి "సంతానోత్పత్తి" పిలుపు అవసరమా? చదువుకున్న ఓటర్ల చేత "థూ" అని ఉమ్మేయించుకోవడానికి తప్ప దేనికీ పనికిరాదు. రాష్ట్రంలో ఛీత్కారాలు, కేంద్ర స్థాయిలో రాష్ట్రానికి తలవంపులు! ఏమిటో! ఏళ్లు గడిచే కొద్దీ తెదేపా ఆలోచనలు మరీ విడ్డూరంగా, వికారంగా ఉంటున్నాయి. మార్చుకోవాలి.

# వైసీపీ మీటింగ్‌కు ఆ ఇద్దరూ డుమ్మా!



విజయవాడ:వైసీపీలో ఏమి జరుగుతోందో పార్టీ పెద్దలకు కూడా అర్థం కావడం లేదు. పార్టీలోనే ఉంటున్నారు. మౌన ముద్రలోనే ఉంటున్నారు. పార్టీ ఇచ్చే పిలుపులకు స్పందించడం లేదు. మీటింగ్‌లకు పిలిస్తే రావడం లేదు. ఆ ఇద్దరూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన పెద్ద నాయకులు కావడం విశేషం.మాజీ మంత్రి, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు మరియు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యవహారం పార్టీ పెద్దలకు మింగుడు పడడం లేదు. శ్రీకాకుళం ఇన్‌చార్జి పదవి ప్రసాదరావుకే ఇస్తామన్నా, ఆయన నుంచి సరైన స్పందన లేదని అంటున్నారు.తమ్మినేని సీతారాంను శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించినా సైలెంట్‌గానే ఉంటున్నారు. ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబు తొలిసారి ఆ హోదాలో శ్రీకాకుళం వచ్చి మీటింగ్ పెట్టితే, ఈ ఇద్దరు నాయకులు డుమ్మా కొట్టారు.దీంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని అంటున్నారు. ఈ ఇద్దరూ బలమైన సామాజిక వర్గానికి చెందినవారు కావడమే కాకుండా, రాజకీయ అనుభవం విశేషంగా కలిగి ఉన్నారు. దాంతో పార్టీ వీరి విషయంలో వేచి చూడే ధోరణిలో ఉందని అంటున్నారు. ఈ ఇద్దరు ఇతర పార్టీలలోకి వెళ్తారని ప్రచారం జరిగినా, అక్కడ నుంచి సరైన సానుకూలత రాలేదని చెబుతున్నారు. దాంతో ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది, కాబట్టి అప్పటివరకు ఆలోచిం చుకోవచ్చు అనే విధంగా ఈ నాయకులు వైసీపీలోనే ఉంటారా అన్నది తర్కించుకు ంటున్నారు. కీలక సమావేశం జరిగితే, ఇద్దరు నేతలు రాకపోవడం పట్ల పార్టీలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.తమకంటే జూనియర్ ఇన్‌చార్జిగా ఉన్నారని భావించి రాలేదా? అన్నది కూడా ఆలోచనకు వస్తోంది. అయితే కన్నబాబు మాత్రం ఎలాంటి భేషజాలకు పోకుండా ఈ ఇద్దరు నేతల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారని అంటున్నారు.శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ రాజకీయంగా ఒడిదుడు కులు ఎదుర్కొంటోంది. అక్కడ ఫ్యాన్ పార్టీకి బోలెడు రిపేర్లు చేయాల్సి ఉంది. కన్నబాబు తన ఉత్సాహాన్ని నూరు శాతం చూపిస్తే ఫలితం రావచ్చు అని అంటున్నారు. ఆయనకు అధినాయకత్వం పూర్తి స్థాయిలో అండగా ఉన్నట్లు చెబుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com